
జగజ్జననికి జేజేలు



పిడుగురాళ్లలో కన్యకాపరమేశ్వరి అమ్మవారు

దసరా సంబరాలు ఊరూవాడా ఘనంగా ప్రారంభమయ్యాయి. గురువారం ఉదయం ఆలయాల్లో అమ్మవారికి అభిషేకాలు నిర్వహించి పూజలు చేశారు. ప్రత్యేక అలంకరణ అనంతరం అమ్మవారు భక్తులకు దర్శనమిచ్చారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సాంస్కృతిక కార్యక్రమాలు ఎంతగానో అలరించాయి.

- న్యూస్‌టుడే బృందం



సత్తెనపల్లి: మేదర బజారు ఆలయంలో బాలా త్రిపురసుందరి అలంకరణ



అమరావతి: రజత కవచాలంకరణలో బాలచాముండికా



సత్తెనపల్లిలోని హోలీ ఫ్యామిలీ పాఠశాల విద్యార్థినుల వేషధారణ

డిసెంబర్ 11న భగవద్గీత శ్లోక కంఠస్త పఠన పోటీలు

గుంటూరు : తిరుపతి తిరుమల దేవస్థానం (తితిదే), హిందూ ధర్మ ప్రచార పరిషత్ (హెచ్‌డీపీపీ) ఆధ్వర్యంలో గీత జయంతి పురస్కరించుకొని డిసెంబర్ 11వ తేదీన భగవద్గీత శ్లోక కంఠస్త పఠన పోటీలు నిర్వహిస్తున్నట్లు తితిదే, హెచ్‌డీపీపీ ఉమ్మడి జిల్లా సమన్వయ కర్త అమ్మడు తెలిపారు. స్థానిక తితిదే కల్యాణ మండపంలో గురువారం ఆమె వివరాలు తెలిపారు.

కొండమోడు మార్గానికి మహర్దశ



ఈనాడు-నరసరావుపేట

కొండమోడు-పేరేచర్ల మార్గం నాలుగు వరుసలుగా విస్తరణకు నిధుల విడుదలకు అడ్డంకిగా మారిన సాంకేతిక అంశాలు పరిష్కారమయ్యాయి. ఈ మార్గం విస్తరణకు 2022-23 ఆర్థిక సంవత్సరంలో భారత్‌మాల కింద మంజూరైంది. గుత్తేదారును ఎంపిక చేసే ప్రక్రియ పూర్తయినా నిధులు విడుదల చేయకపోవడంతో పనులు ప్రారంభం కాలేదు. దీంతో మార్గం విస్తరణపై నీలి నీడలు కమ్ముకున్నాయి. ఈ నేపథ్యంలో ఇటీవల రాష్ట్ర ఆర్‌అండ్‌బీ మంత్రి కేంద్ర మంత్రి నితిన్‌గడ్కరీని కలిసి భారత్ మాల కింద ఉన్న రోడ్లను జాతీయ రహదారుల సాధారణ కార్యక్రమం(ఎన్‌హెచ్‌వో) కింద కొనసాగించాలని కోరారు. కేంద్ర రవాణా, జాతీయ రహదారుల మంత్రిత్వ శాఖ(మోర్త్) స్టాండింగ్ ఫైనాన్స్ కమిటీ 8 రోడ్లకు అంగీకారం తెలిపింది. ఈ జాబితాలో కొండమోడు-పేరేచర్ల మార్గం ఉండటంతో నిధుల విడుదలకు మార్గం సుగమమైంది. 49.9 కిలోమీటర్ల మార్గాన్ని నాలుగు వరుసలుగా విస్తరించడానికి గత ఏడాది ఆగస్టులో రూ.1032.52 కోట్ల అంచనాతో టెండర్లు పిలవగా రాజేంద్రసింగ్ బేంబూ ఇన్‌ఫ్రా ప్రైవేట్ లిమిటెడ్ అనే సంస్థ దక్కించుకుంది. ఈ మార్గం విస్తరిస్తే గుంటూరు, పల్నాడు జిల్లాల్లో రాకపోకలు మరింత సులభమై అభివృద్ధి వేగవంతమవుతుంది.

మోర్త్ ఆమోదంతో తొలగిన అడ్డంకులు


నిధుల విడుదలకు మార్గం సుగమం

దశాబ్దాల కల..

గుంటూరు నుంచి హైదరాబాద్ మార్గంలో పేరేచర్ల నుంచి కొండమోడు వరకు మార్గాన్ని విస్తరించాలనేది దశాబ్దాల కల. ఈ మార్గం అద్దంకి-నార్కట్‌పల్లి రాష్ట్ర రహదారితో కొండమోడు వద్ద అనుసంధానమై తెలంగాణ వెళ్లే వారికి అత్యంత అనుకూలంగా ఉంది. గుంటూరు నుంచి పల్నాడు ప్రాంతం వైపు వెళ్లే వారికి కొండమోడు మార్గం కీలకం. ఇంతటి కీలకమైన మార్గాన్ని విస్తరించడానికి ఎప్పటికప్పుడు అడ్డంకులు ఎదురవుతున్నాయి. ఈ మార్గం ప్రాధాన్యం దృష్ట్యా పల్నాడు జిల్లా పిడుగురాళ్ల సమీపంలోని కొండమోడు నుంచి గుంటూరు సమీపంలోని పేరేచర్ల వరకు జాతీయ రహదారి(167 ఏజీ)గా కేంద్రం గుర్తించింది. దీనిని కేంద్రం జాతీయ రహదారిగా గుర్తించడంతో ఎట్టకేలకు మోక్షం లభించింది. గత వైకాపా ప్రభుత్వంలోనే కేంద్రం నిధులు మంజూరు చేసినా సకాలంలో భూసేకరణ చేయకపోవడంతో ఒక్క అడుగూ ముందుకు పడలేదు. ఈ మార్గం ప్రాధాన్యం దృష్ట్యా రాష్ట్ర ప్రభుత్వం తరఫున నరసరావుపేట ఎంపీ శ్రీకృష్ణదేవరాయలు, ఆర్‌అండ్‌బీ మంత్రి జనార్దన్‌రెడ్డి నిధులు విడుదల చేయాలని కేంద్రాన్ని కోరారు. దీంతో కేంద్రం సానుకూలంగా స్పందించి నిధుల విడుదలకు ఆమోదం తెలిపింది. ప్రస్తుతం 7 నుంచి 10 మీటర్ల వెడల్పుతో రహదారి ఉండటంతో వాహనాల రద్దీ పెరిగి ప్రమాదాలు జరుగుతున్నాయి. మార్గం చిన్నదిగా ఉండటంతోపాటు ఎదురుగా నిరంతరంగా వాహనాలు వస్తుండటంతో ఒకదాని వెనుక ఒక వాహనం వెళ్లాల్సి వస్తోంది. దీంతో ప్రయాణ సమయంతోపాటు విలువైన ఇంధనం వృథా అవుతోంది. ఈ మార్గం విస్తరణ పూర్తయి అందుబాటులోకి వస్తే హైదరాబాద్ నుంచి నూతన రాజధాని అమరావతికి ప్రయాణ సమయం తగ్గడంతోపాటు ఇంధనం ఆదా అవుతుంది.

భూసేకరణ ప్రక్రియ పూర్తి

పేరేచర్ల నుంచి కొండమోడు మార్గాన్ని నాలుగు వరుసలుగా విస్తరించడానికి గుంటూరు, సత్తెనపల్లి ఆర్డీవోల పరిధిలో 234 హెక్టార్ల భూమి సేకరించాలి. సర్వే పూర్తిచేసి ప్రభుత్వ, ప్రైవేటు, అసైన్డు, పోరంబోకు భూములను విభాగాలుగా విభజించి నివేదిక సిద్ధం చేశారు. భూసేకరణకు సంబంధించిన ప్రక్రియ మొత్తం పూర్తి చేసి కేంద్రానికి రాష్ట్రం నివేదిక అందించింది. కేంద్రం భూసేకరణకు నిధులు విడుదల చేసిన వెంటనే రైతుల ఖాతాల్లో సొమ్ము చేసి గుత్తేదారుకు భూమి అప్పగిస్తారు. నాలుగు వరుసల విస్తరణలో ఒక్కొక్క వైపు 8.75 మీటర్ల వెడల్పు రహదారి, డివైడర్ 1.5 మీటర్లు, రెండువైపులా మార్జిన్లు కలిపి 22.5 మీటర్ల వెడల్పుతో నిర్మిస్తారు. మేడికొండూరులో 4 నుంచి 5 కిలోమీటర్లు బైపాస్, సత్తెనపల్లిలో 11 కిలోమీటర్ల బైపాస్ నిర్మించాల్సి ఉంది. గుత్తేదారు ఎంపిక పూర్తయినందున త్వరలోనే పనులు పట్టాలెక్కనున్నాయి.



సీఎం చంద్రబాబుకు చెక్కు అందజేస్తున్న ఎమ్మెల్యే జీవీ ఆంజనేయులు

అన్న క్యాంటీన్ల నిర్వహణకు జీవీ రూ.10 లక్షల విరాళం

వినుకొండ: వినుకొండ శాసనసభ్యుడు జీవీ ఆంజనేయులు అన్న క్యాంటీన్ల నిర్వహణకు రూ.10 లక్షలు విరాళం అందించారు. అమరావతిలో సీఎం చంద్రబాబు నాయుడును గురువారం కలిసి చెక్కు అందజేశారు. పేదల కడుపు నింపే మహోన్నత కార్యక్రమాన్ని ప్రారంభించిన ముఖ్యమంత్రికి కృతజ్ఞతలు తెలిపారు. పలువురు తెదేపా నాయకులు పాల్గొన్నారు.

జిల్లాలో ఏటా 15 శాతం వృద్ధికి ప్రణాళికలు: కలెక్టర్

నరసరావుపేట అర్బన్ : జిల్లాలో రానున్న ఐదేళ్లలో ఏటా 15 శాతం అభివృద్ధి సాధించేందుకు ప్రణాళికలు రూపొందించామని కలెక్టర్ అరుణ్‌బాబు పేర్కొన్నారు. కలెక్టరేట్‌లో గురువారం స్వర్ణాంధ్ర 2047 ముసాయిదాపై ప్రజాప్రతినిధులు, ఛాంబర్ ఆఫ్ కామర్స్, ఇండస్ట్రీ, రైతు సంఘాలతో సమావేశం నిర్వహించారు. ఎమ్మెల్యేలు జీవీ ఆంజనేయులు, కన్నా లక్ష్మీనారాయణ, చదలవాడ అరవిందబాబు, జూలకంటి బ్రహ్మారెడ్డి, ఎమ్మెల్సీ కేఎస్ లక్ష్మణరావు హాజరయ్యారు. ఈ సందర్భంగా స్వర్ణాంధ్ర ముసాయిదాలోని అంశాలను కలెక్టర్ వివరించారు. అనంతరం కేంద్ర ప్రభుత్వ అమృత పథకం గురించి సమీక్ష చేశారు. కలెక్టర్ మాట్లాడుతూ నరసరావుపేట పురపాలక సంఘం పరిధిలో రూ.13.53 కోట్లతో చేపట్టిన పనులు 99 శాతం, చిలకలూరిపేటలో రూ.8.82 కోట్లతో మంచినీటి సరఫరా పనులు 94 శాతం పూర్తయినట్లు పేర్కొన్నారు. అమృత్ పథకం రెండో దశలో రూ.153 కోట్లతో సమ్మర్ స్టోరేజీ ట్యాంకుల నిర్మాణం చేపడుతున్నట్లు వెల్లడించారు. జిల్లా అధికారులు ఉన్నారు.



మాట్లాడుతున్న కలెక్టర్ అరుణ్‌బాబు, హాజరైన ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు

నరసరావుపేట కేంద్రంగా విద్యుత్తు శాఖ సర్కిల్ కార్యాలయం

కొత్త ఎస్ఈగా విజయకుమార్ నియామకం



నరసరావుపేట అర్బన్, న్యూస్‌టుడే : జిల్లాలో విద్యుత్తు శాఖకు సంబంధించిన సమస్యలు త్వరగా తీర్చేందుకు ప్రభుత్వం చొరవ చూపింది. కొత్త జిల్లాలు ఏర్పాటై రెండేళ్లు గడిచినా పల్నాడు జిల్లా పర్యవేక్షణ గుంటూరులోని సర్కిల్ కార్యాలయం నుంచే సాగింది. దీంతో సమస్య ఏమున్నా గుంటూరు అధికారుల అనుమతులు వచ్చే వరకు వేచి చూడాల్సి వచ్చేది. తాజాగా రాష్ట్ర ప్రభుత్వం నరసరావుపేట కేంద్రంగా సర్కిల్ కార్యాలయం ఏర్పాటుకు అనుమతించింది. కొత్త ఎస్ఈగా సీఆర్‌డీఏ ఎస్ఈగా బాధ్యతలు చూస్తున్న డాక్టర్ ప్రత్తిపాటి విజయ్‌కుమార్‌ను నరసరావుపేటకు బదిలీ చేసింది. శుక్రవారం ఆయన బాధ్యతలు స్వీకరించనున్నట్లు ఈఈ రాంబొట్లు తెలిపారు.

నాణ్యమైన సేవలకు ఆస్కారం : జిల్లాకు సంబంధించిన విద్యుత్తు వినియోగదారులకు నాణ్యమైన సేవలందించేందుకు సర్కిల్ కార్యాలయం ఏర్పాటు దోహదపడుతుంది. గుంటూరులో ఉన్న అన్ని విభాగాలు నరసరావుపేటలో ఏర్పాటు చేసేందుకు ప్రభుత్వం అనుమతించింది. ఇందుకు 48 మంది ఇంజినీర్లు, ఉద్యోగులతో సర్కిల్ ఏర్పాటు కానుంది. కొత్తగా ఈఈలు ముగ్గురు, డీఈలు ఇద్దరు, ఏడీలు ఐదుగురిని ప్రభుత్వం కేటాయించింది. టెక్నికల్, ఎంఆర్‌టీ, ఆపరేషన్, మెటీరియల్ విభాగాలు నరసరావుపేటలో ఏర్పాటు చేస్తారు. దీంతో మరమ్మతులకు అవసరమైన సామగ్రి కోసం అనుమతులు, ఇండెంట్ తదితరాలు వెంటనే పూర్తవుతాయి. అంతే కాకుండా ట్రాన్స్‌ఫార్మర్లు కూడా నరసరావుపేటలోనే మరమ్మతులు చేస్తారు. దీంతో రైతాంగానికి విద్యుత్తు సమస్యలు తీరేందుకు అవకాశం ఉంది.

అమ్మకు కడుపు కోత

ఈనాడు డిజిటల్, నరసరావుపేట

నరసరావుపేటలోని ఓ ప్రైవేటు ఆసుపత్రికి ఇటీవల ఒక గర్భిణి కాన్పుకు వచ్చింది. ఆమె సహజ కాన్పునకు అవసరమైన ఆరోగ్య, మానసిక పరిస్థితులున్నాయి. మూడు నెలలుగా చేస్తున్న పలు పరీక్షల రిపోర్టులు కూడా సహజ ప్రసవం చేయొచ్చు అని తేల్చాయి. సాధారణ కాన్పు చేయాలని కుటుంబ సభ్యులు కోరారు. అయినా సరే ఆసుపత్రి సిబ్బంది భయపెట్టి సిజేరియన్ వైపు మళ్లించారు. సుమారు రూ.1.2 లక్షల దాకా బిల్లు వేశారు. నెల తిరగక ముందే ఆ మహిళకు తీవ్ర కడుపునొప్పి వచ్చింది. వైద్యులను సంప్రదిస్తే సిజేరియన్ దుష్పరిణామాల వల్లే ఇలా జరిగిందని చెప్పారు. ఈ పరిస్థితి జిల్లాలో చాలా మంది మహిళలకు శాపంగా మారుతోంది.

పంటి బిగువున నొప్పి భరించి, ప్రసవ వేదన అనుభవించి బిడ్డకు జన్మనిస్తుంది తల్లి. అవసరం ఉన్నా లేకున్నా కాన్పు కోతలు పెరిగిపోతున్నాయి. ఇవి తల్లీ, బిడ్డ ఆరోగ్యానికి ముప్పు. కొన్ని ప్రత్యేక సందర్భాల్లో మాత్రమే సిజేరియన్లు చేయాలి. ఇవి మొత్తం కాన్పుల్లో 25 శాతానికి మించడం ప్రమాదం. పల్నాడు జిల్లాలో 55 శాతానికిపైగా ఉంటున్నాయి.



అవసరం లేకున్నా బంధువులను భయపెట్టి.. : సుఖ ప్రసవానికి వీలు లేనప్పుడు, కడుపులో బిడ్డ సరిగా లేనప్పుడే సిజేరియన్లు చేయాలి. సహజ ప్రసవానికి అవకాశం ఉన్నప్పటికీ ఉమ్మనీరు తక్కువగా ఉందని, బిడ్డ అడ్డం తిరిగిందని, గుండె వేగంగా కొట్టుకుంటోందని, పురిటి నొప్పుల బాధ భరించలేరని చెబుతూ బంధువులను భయపెట్టి అవసరం లేకపోయినా సిజేరియన్లు చేస్తున్నారు. సాధారణ ప్రసవంతో పోలిస్తే సిజేరియన్ ప్రసవాలకు పట్టే సమయం చాలా తక్కువ. శస్త్ర చికిత్స వల్ల ఆసుపత్రికి ఆదాయం సమకూరుతుంది. అయితే సదరు మహిళకు తర్వాత తరచూ కడుపునొప్పి, ఇన్‌ఫెక్షన్, అధిక బరువు, నెలసరి వంటి సమస్యలు ఎదురవుతున్నట్లు నిపుణులు అభిప్రాయపడుతున్నారు.

- కొందరు గర్భిణులు, కుటుంబ సభ్యులు కూడా సిజేరియన్ల వైపు మొగ్గుచూపుతున్నారు. నొప్పి భయం, మంచి ముహూర్తం అంటూ వైద్యులపై ఒత్తిడి తెచ్చేవారు ఉంటున్నారు.

కాసులకు ప్రైవేటు ఆసుపత్రుల కక్కుర్తి

జిల్లాలో 55 శాతానికిపైగా సిజేరియన్లు

ఇలాగైతే.. తల్లీబిడ్డకు కష్టాలు

ప్రస్తుతం ఎక్కువగా జరుగుతున్న సిజేరియన్ల వల్ల తల్లీబిడ్డకు ఆరోగ్య సమస్యలు ఎదురయ్యే ప్రమాదాలు ఉన్నాయని నిపుణులైన వైద్యులు చెబుతున్నారు. పుట్టిన మొదటి గంటలో శిశువు తల్లిపాలు తాగితే అమృతంతో సమానం అంటున్నారు. శస్త్రచికిత్సల కారణంగా మొదటిగంటలో తల్లిపాలు తాగే వీలు లేకుండా పోవడంతో నష్టం జరుగుతోంది. రక్తస్రావం అధికమైనా, ఇతరత్రా సమస్యలు తలెత్తినా ప్రాణాపాయంతో పాటు భవిష్యత్తులో ఇబ్బందులు ఎదుర్కోవాల్సి రావచ్చు. గర్భాశయానికి గాట్లు పెట్టి కుట్లు వేసిన ప్రాంతంలో మాయ అతుక్కుపోయే అవకాశాలుంటాయి. దీంతో అప్పుడప్పుడు తీవ్ర కడుపు నొప్పి సమస్యలు తలెత్తవచ్చు. కొన్ని సందర్భాల్లో గర్భసంచి తొలగించే పరిస్థితి ఎదురవుతుంది. సాధారణ ప్రసవాలే తల్లీపిల్లలకు మేలు. మహిళలు రెండురోజుల్లోనే ఎప్పటిలా పనులు చేసుకోవచ్చు. రెండో కాన్పుపై దుష్ప్రభావం ఉండదు. గర్భసంచికి ప్రమాదం తక్కువ. భవిష్యత్తులో రుగ్మతలకు గురికాకుండా సంపూర్ణ ఆరోగ్యవంతులుగా ఉంటారు. పుట్టిన బిడ్డకు మొదటి గంటలో తల్లిపాలు అందించవచ్చు.

ప్రభుత్వ వైద్యశాలలో సాధారణ ప్రసవాలే

ప్రభుత్వ ఆసుపత్రుల్లో మాత్రం సాధారణ ప్రసవాలు జరిగేలా చూస్తున్నాం. అత్యవసరమైన సమయాల్లో మాత్రమే సిజేరియన్‌కు రిఫర్ చేస్తాం. ప్రైవేటులో అనవసరంగా సిజేరియన్లు జరుగుతున్నాయని తెలిస్తే తనిఖీలు నిర్వహిస్తూ మెమోలు జారీ చేస్తున్నాం. ప్రత్యేకంగా ఆడిట్ చేస్తున్నాం.

- రవి, డీఎంహెచ్‌వో

పత్తి కొనుగోలు కేంద్రాలపై విస్తృత ప్రచారం చేయండి

నరసరావుపేట వ్యవసాయం, న్యూస్‌టుడే : జిల్లాలోని రైతు సేవా కేంద్రాల ద్వారా పత్తి కొనుగోలు కేంద్రాలపై విస్తృత ప్రచారం చేయాలని జిల్లా జాయింట్ కలెక్టర్ సూరజ్ గనోరే ఆదేశించారు. 2024- 25 ఆర్థిక సంవత్సరానికి ప్రత్తి కొనుగోలు కేంద్రాల ఏర్పాటుకు సంబంధించి గురువారం కలెక్టర్ కార్యాలయంలో జిల్లా స్థాయి కమిటీ సభ్యులతో, మార్కెట్ యార్డుల కార్యదర్శులతో జేసీ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పత్తి కొనుగోలు కేంద్రాల్లో అమ్ముకునే రైతుల రిజిస్ట్రేషన్ ప్రక్రియ నూరుశాతం పూర్తి చేయాలని, కొనుగోలు కేంద్రాల వద్ద వేబ్రిడ్జిలు తనిఖీలు, అవసరమైన వసతులు ఉన్నాయా లేవా పరిశీలించాలని సూచించారు. రైతులు లూజు పత్తిని కొనుగోలు కేంద్రాలకు తీసుకువచ్చేలా ప్రోత్సహించాలన్నారు. సమావేశంలో జిల్లా మార్కెటింగ్ శాఖ అధికారి సూర్యప్రకాష్‌రెడ్డి, జిల్లా వ్యవసాయాధికారి ఐ.మురళీ, అదనపు జిల్లా ఎస్పీ జేవీ సంతోష్, జిల్లా రవాణా అధికారి శివనాగేశ్వరరావు, జిల్లా అగ్నిమాపక శాఖ అధికారి ఎస్. శ్రీధర్, మార్కెట్ యార్డుల కార్యదర్శులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న జేసీ సూరజ్ గనోరే, పక్కన జిల్లా మార్కెటింగ్ శాఖ అధికారి సూర్యప్రకాష్‌రెడ్డి

8 నుంచి దసరాకు ఆర్టీసీ ప్రత్యేక బస్సులు

గుంటూరు, న్యూస్‌టుడే: దసరా పండగ సందర్భంగా ప్రయాణికుల సౌకర్యార్థం ఈనెల 8వ తేదీ నుంచి 11వ తేదీ వరకు రోజూ ప్రత్యేక బస్సులు హైదరాబాద్ నుంచి గుంటూరు జిల్లాలోని అయిదు డిపోల బస్టాండ్లకు ఏర్పాటు చేసినట్లు జిల్లా ప్రజా రవాణా అధికారి రవికాంత్ ఒక ప్రకటనలో తెలిపారు. 8వ తేదీ 7 బస్సులు, 9న 16, 10న 28, 11న 35 బస్సులు ఏర్పాటు చేశామని, హైదరాబాద్ పరిసర ప్రాంతాల నుంచి గుంటూరుకు వచ్చే ప్రయాణికులు ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని ఆయన కోరారు. పండగ ముగిసిన తరవాత 12వ తేదీ నుంచి 15వ తేదీ వరకు జిల్లాలోని వివిధ బస్టాండ్ల నుంచి ప్రయాణికుల రద్దీని దృష్టిలో ఉంచుకొని హైదరాబాద్, చెన్నై, తిరుపతి, బెంగళూరు, విశాఖపట్నంకు బస్సులు ఏర్పాటు చేయనున్నట్లు ఆయన తెలిపారు. ప్రయాణికులు ముందస్తు రిజర్వేషన్ చేయించుకోవాలని ఆయన సూచించారు.

టెట్ పరీక్షల ప్రారంభం

నరసరావుపేట అర్బన్, న్యూస్‌టుడే : జిల్లాలో టెట్ పరీక్షలు ప్రారంభమయ్యాయి. పరీక్షల నిర్వహణకు అధికారులు నాలుగు కేంద్రాలు ఏర్పాటు చేశారు. తొలిరోజు ఎంఎఎం మహిళా ఇంజినీరింగ్ కళాశాల, ఏఎంరెడ్డి స్మారక ఇంజినీరింగ్ కళాశాలల్లో పరీక్షలు నిర్వహించారు. 260 మందికి గాను 229 మంది హాజరయ్యారు. నోడల్ అధికారిణి ఆర్ఎస్‌జీ భవాని, డీఈవో వెంకటేశ్వర్లు పరీక్ష కేంద్రాలను తనిఖీ చేశారు. షెడ్యూల్ ప్రకారం పకడ్బందీగా నిర్వహించేందుకు చర్యలు తీసుకున్నట్లు డీఈవో తెలిపారు.

వ్యాధులు ప్రబలకుండా చర్యలు తీసుకోవాలి

నరసరావుపేట అర్బన్, న్యూస్‌టుడే : జిల్లాలో సీజనల్ వ్యాధులు ప్రబలకుండా సమగ్ర చర్యలు తీసుకోవాలని రాష్ట్ర వైద్య ఆరోగ్యశాఖ అదనపు డైరెక్టర్ డాక్టర్ సుబ్రహ్మణ్యేశ్వరి అన్నారు. రాష్ట్రంలో సీజనల్ వ్యాధుల వ్యాప్తిపై సమీక్ష నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ గత ఏడాదితో పోల్చితే జిల్లాలో డెంగీ, గన్యా పెరిగేందుకు కారణాలు అడిగి తెలుసుకున్నారు. సీజనల్ వ్యాధుల నియంత్రణకు ప్రజల భాగస్వామ్యం అవసరమని తెలిపారు. నీరు నిల్వ ఉండటంతో పాటు పరిసరాలు అపరిశుభ్రత, వ్యక్తిగత శుభ్రత లేకపోవడం, నిల్వ ఉంచిన ఆహారం తీసుకోవడం కారణాలుగా విశ్లేషించారు. డీఎంహెచ్‌వో డాక్టర్ రవి జిల్లాలో వ్యాధుల నియంత్రణకు తీసుకుంటున్న చర్యలు వివరించారు. డీఎంవో రవీంద్ర రత్నాకర్ జిల్లా రక్త పూతల సేకరణ, పరీక్షలు తదితర అంశాలు వివరించారు. కేంద్ర మలేరియా విభాగం అధికారి డాక్టర్ కల్యాణి, అధికారులు ఉన్నారు.



ప్రయోగశాలను పరిశీలిస్తున్న అదనపు డైరెక్టర్ సుబ్రహ్మణ్యేశ్వరి

మిర్చితో ఏమార్చి!

- అడ్డదిడ్డంగా జీడీసీసీబీ రుణాలు
- గడువు దాటినా వసూలు కాని బకాయిలు

ఈనాడు - అమరావతి

శీతల గోదాముల్లో నిల్వ చేసిన మిర్చికి బ్యాంకుల నుంచి తీసుకున్న రుణాలు సకాలంలో వసూలు కావడం లేదు. పైగా తనఖా పెట్టిన మిర్చి బస్తాలు మాయం కావడంతో ఆ బకాయి వసూలు చేయడం బ్యాంకర్లకు తలకుమించిన భారమవుతోంది. ఇందులో గుంటూరు జిల్లా కేంద్ర సహకార బ్యాంకు వాటా ఎక్కువగా ఉండడం గమనార్హం. గోదాముల యజమానుల్లో కొందరు నకిలీ బాండ్లు సృష్టించి వారికి తెలిసిన వ్యక్తులను రైతులుగా చూపించి రుణాలు పొంది సొంతానికి వాడుకున్నారు. మిర్చి నిల్వ చేసి తీసుకున్న రుణాలకు ఏడాది కాల వ్యవధి ఉంటుంది. ఈ గడువు ముగిసినా బకాయిలు వసూలు కాని పక్షంలో మిర్చిని వేలం వేసి సొమ్ము రాబట్టుకునే అవకాశం బ్యాంకర్లకు ఉంది. అయితే మిర్చి నిల్వలు బ్యాంకుకు తెలియకుండా అమ్ముకోవడం, మరో బ్యాంకుకు ఆ నిల్వలు చూపించి రుణాలు తీసుకోవడంతో వాటిని వేలం వేసే పరిస్థితి ఉండడం లేదు.

ఉమ్మడి జిల్లాలో శీతల గోదాముల్లో మిర్చి నిల్వ చేసిన రైతులకు జిల్లా కేంద్ర సహకార బ్యాంకు (జీడీసీసీబీ) ఇచ్చిన రుణాలు రూ. 164 కోట్లు
ఇందులో ఒక్క నల్లపాడు శాఖ ఇచ్చిన మొత్తం... రూ. 116 కోట్లు
జిల్లావ్యాప్తంగా జీడీసీసీబీకి పేరుకుపోయిన బకాయిలు... రూ. 53 కోట్లు
ఒక్క నల్లపాడు శాఖ పరిధిలోని బకాయిలే ఏకంగా రూ. 40 కోట్లు...

జీడీసీసీబీ నల్లపాడు బ్రాంచి ఇచ్చిన రూ. 116 కోట్ల రుణాల్లో మూడు నెలల వ్యవధిలో ఇచ్చినవే ఎక్కువగా ఉన్నాయి. ఈ శాఖ పరిధిలో రూ. 25 కోట్లకు సంబంధించి ఇప్పటికే ఏడాది గడువు పూర్తయింది. మరో రూ. 15 కోట్లకు ఏడాది గడువు పూర్తికావడానికి కొన్ని రోజుల సమయం ఉంది. ఈ శాఖ పరిధిలో బకాయిలు పెరుగుతుండడం, సకాలంలో చెల్లింపులు చేయకపోవడంతో బ్యాంకు ఉన్నతాధికారులు ప్రతివారం రుణాల రికవరీ వేగవంతం చేయాలని సూచిస్తున్నారు. బకాయిలు వసూలుకాని పక్షంలో సంబంధిత మిర్చిని వేలం వేయాలని చెబుతున్నా.. ఆ దిశగా అడుగులు పడడం లేదు.

రాఘవేంద్ర శీతలగోదాములో నకిలీ బాండ్లు పెట్టి రుణాలు పొందారు. ఇందులో నల్లపాడు బ్రాంచికు రూ. 4 కోట్ల బకాయి వసూలు కావాల్సి ఉంది. గోదాములోని మిర్చిలో కొంత ఇప్పటికే విక్రయించడం, మరో బ్యాంకులోనూ బాండ్లు పెట్టి రుణాలు పొందినందున జీడీసీసీబీకి చూపిన బస్తాలు ఉన్నాయా? లేవా? అన్నది విచారణలో తేలాల్సి ఉంది.



కొరవడిన పర్యవేక్షణ

నల్లపాడు బ్రాంచి పరిధిలో ఒక్కో రైతు పేరుమీద గరిష్ఠంగా రూ. 10 లక్షల రుణమిచ్చారు. ఇంత పెద్దమొత్తంలో ఇచ్చినప్పుడు క్షేత్రస్థాయిలో అంతా పక్కాగా ఉందా? లేదా? అన్నది బ్యాంకు ఉన్నతాధికారులు తనిఖీ చేసి ఉంటే నిబంధనలు పక్కాగా అమలయ్యేవి. బ్యాంకు విశ్రాంతి ఉద్యోగి ధ్రువీకరణ ఆధారంగా రుణాలిచ్చేయడం గమనార్హం. గోదాములకెళ్లి సరకు ఉందా? లేదా? ఇతర బ్యాంకుల్లో తనఖా పెట్టారా? బాండ్లు నకిలీవా? అసలువా? రైతులే రుణాలు తీసుకుంటున్నారా? వంటి అంశాలు పక్కాగా పరిశీలించకుండానే రుణాలు మంజూరు చేశారు.

అక్రమాలు జరుగుతున్నాయని ఆపేసినా....

జీడీసీసీబీ నుంచి రుణాలిచ్చిన ప్రతిసారీ సొమ్ము పక్కదారి పడుతోంది. గతంలో రెండుసార్లు ఇలా వివాదాస్పదం కావడం, రూ. 1.35 కోట్లకుపైగా ఇప్పటికీ వసూలు కాకపోవడంతో ప్లెడ్జ్ రుణాలివ్వడం ఆపేశారు. వైకాపా గద్దెనెక్కాక సొసైటీ పాలక వర్గాలకు ఎన్నికలు నిర్వహించకుండా నామినేట్ చేసి చేతులు దులిపేసుకుంది. వీరు బ్యాంకు యంత్రాంగంపై ఒత్తిడి తెచ్చి గత మూడేళ్లుగా ప్లెడ్జ్ రుణాలు మంజూరు చేయించారు. ఆ బకాయిలే బాగా పేరుకుపోయాయి. వైకాపా నేతల అనాలోచిన నిర్ణయం బ్యాంకు పాలిట శాపంగా మారింది.

53,641 మిర్చి బస్తాల విక్రయం

గుంటూరు, న్యూస్‌టుడే: గుంటూరు మిర్చియార్డులో గురువారం 53,641 మిర్చి బస్తాల విక్రయాలు జరిగాయి. రైతులు 54,870 బస్తాలు యార్డుకు తరలించారు. అమ్మకాలు ముగిసే సమయానికి యార్డులో 26,718 బస్తాలు నిల్వ ఉన్నాయి. నాన్ ఏసీ కామన్ వెరైటీ మిర్చి రకాల సగటు ధర రూ.8,000-16,000, నాన్ ఏసీ స్పెషల్ వెరైటీ మిర్చి రకాల సగటు ధర రూ.9,000-18,600, తాలు మిర్చికి రూ.5,000-11,500 ధర లభించింది. ఏసీ కామన్ వెరైటీ మిర్చి రకాల సగటు ధర రూ.9,000-16,500, ఏసీ స్పెషల్ వెరైటీ మిర్చి రకాల సగటు ధర రూ.9,000-18,500, తాలు మిర్చికి రూ.5,000-11,000 ధర లభించింది.

సాంకేతిక పరిజ్ఞాన వినియోగంతో అధిక దిగుబడులు

రొంపిచర్ల, న్యూస్‌టుడే: వ్యవసాయ రంగంలో సాంకేతిక పరిజ్ఞానాన్ని వినియోగించుకుంటే అధిక దిగుబడులు సాధించవచ్చని ఏరువాక కేంద్రం జిల్లా సీనియర్ శాస్త్రవేత్త డాక్టర్ ఎం.వెంకటలక్ష్మి అన్నారు. మండలంలోని కొత్తపల్లి, ఎడ్వర్డ్‌పేటలో గురువారం 'పొలం పిలుస్తోంది' కార్యక్రమం నిర్వహించారు. కొత్తపల్లిలో ఆచార్య ఎన్.జి.రంగా వ్యవసాయ విశ్వ విద్యాలయానికి చెందిన ఆస్పైర్ ప్రాజెక్టు సహకారంతో లాంఫెన్ సమగ్ర కలుపు యాజమాన్య విభాగ శాస్త్రవేత్తలు వరి పొలంలో కలుపు నివారణ (డ్రోన్ ద్వారా మందు పిచికారి) పై రైతులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా నరసరావుపేట ఏడీఏ మస్తానమ్మ, ప్రాంతీయ వ్యవసాయ పరిశోధన సంస్థ శాస్త్రవేత్తలు డాక్టర్ ఎస్.ప్రతిభశ్రీ, డాక్టర్ పి.అమరజ్యోతి తదితరులు మాట్లాడుతూ వ్యవసాయ రంగంలో సాంకేతికతను తీసుకు వచ్చేందుకు ప్రభుత్వం సిద్ధంగా ఉందని, అన్నదాతలు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ఒక డ్రోన్ ద్వారా ఎకరా మందులు పిచికారికి రూ.400 ఖర్చు అవుతుందని, రైతులకు సమయం కలిసొస్తుందని తెలిపారు. కార్యక్రమంలో ఏవో శివలలిత, పశు వైద్యులు శ్రీకాంత్, వీఏఏ వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.


డ్రోన్ ద్వారా మందు పిచికారి చేసే విధానంపై రైతులకు అవగాహన కల్పిస్తున్న వ్యవసాయాధికారులు, శాస్త్రవేత్తలు

'నాసిరకం విత్తనంతో నష్టపోయా.. న్యాయం చేయండి'


ఏవో హరిప్రసాదుకు మొక్క జొన్న పంట చూపిస్తున్న రైతు శ్రీనివాసరెడ్డి

చందవరం (నాదెండ్ల), న్యూస్‌టుడే : 'పన్నెండు ఏళ్లుగా మొక్క జొన్నపంట సాగు చేస్తున్నాను.. ఈ ఏడాది దుకాణదారుడి మాట నమ్మి అతను ఇచ్చిన విత్తనం వేశాను.. పంట కాపు దశలో విత్తనాలు లేని కండెలతో నిండా మునిగాను.. పెట్టుబడితో పాటు ఆదాయాన్ని కోల్పోయాను.. అధికారులే న్యాయం చేయాలి' అంటూ.. ఓ బాధిత రైతులు వ్యవసాయాధికారిని వేడుకున్నారు.. రైతు వివరాల ప్రకారం.. నాదెండ్ల మండలం చందవరానికి చెందిన రైతు గొంటు శ్రీనివాసరెడ్డి ఏటా తీసి మొక్క జొన్న పంట సాగు చేస్తున్నాడు. గుంటూరు రాజాగారి తోటలో ఓ దుకాణదారుడిని సంప్రదించాడు. కొత్త వంగడం అధిక దిగుబడి వస్తుందని ఓ కంపెనీ ప్యాకెట్లు తీసుకోవాలని యజమాని ఆశ చూపాడు. దీంతో రూ.10,400 చెల్లించి నాలుగు కిలోల విత్తనాలు కొని.. ఎకరాల్లో పంట వేశాడు. కాపు అదును దాటినా.. పంట దొల్లబోయింది. కండె పొట్టిగా అక్కడక్కడ మాత్రమే విత్తనాలున్నాయి. వీటితో మోసపోయినట్లు గ్రహించాడు. దుకాణదారుడికి విషయం చెప్పగా అతను స్పందించ లేదు. దీంతో నాదెండ్ల వ్యవసాయాధికారి హరిప్రసాద్‌కు ఫిర్యాదు చేశాడు. ఏవో గురువారం పంట పొలాన్ని పరిశీలించి.. వివరాలు నమోదు చేసి ఉన్నతాధికారులకు నివేదించారు.

పురుగు మందుల వ్యాపారి టోకరా

రూ.2 కోట్ల అప్పు చేసి అదృశ్యం..!

గొరిజవోలు (నాదెండ్ల), న్యూస్‌టుడే : నాదెండ్ల మండలం గొరిజవోలులో రైతులకు పురుగు మందుల వ్యాపారి టోకరా పెట్టిన విషయం ఆలస్యంగా వెలుగు చూపింది. గ్రామానికి చెందిన వ్యాపారి పెట్టుబడి కోసమని గ్రామస్తుల వద్ద వడ్డీకి భారీ మొత్తంలో అప్పు తీసుకున్నాడు. దీంతో పాటు రైతుల నుంచి వ్యవసాయ ఉత్పత్తులు అరువుగా కొన్నాడు. ప్రస్తుతం నరసరావుపేటలో దుకాణాన్ని నిర్వహిస్తున్న అతను రూ.2కోట్లు వరకు బాకీ చేసినట్లు చర్చించుకుంటున్నారు. గడవు తీరిన వారికి వడ్డీ, అసలు చెల్లించకపోవడంతో సదరు వ్యాపారిని నిలదీయగా.. కొంత సమయం కోరుతూ తప్పించుకుని తిరుగుతున్నాడు. ఆరు నెలలుగా అందుబాటులో లేకపోవడంతో రైతులు ఆందోళన చెందుతున్నారు. తమకు న్యాయం చేయాలని బాధితులు పోలీసు అధికారులను ఆశ్రయించినట్లు తెలిసింది. ఈ విషయాన్ని నాదెండ్ల ఎస్సై పుల్లారావు దృష్టికి తీసుకెళ్లగా.. దీనిపై తమకు సమాచారం ఉందని, అయితే రైతుల నుంచి రాతపూర్వకంగా ఫిర్యాదు అందలేదని చెప్పారు. వ్యాపారి తీరుతో అప్పులిచ్చిన రైతులు ఆవేదన చెందుతున్నారు.

ఈవీ ఆటో

రోడ్లపై రీవీగా ఈవీలు

జిల్లాలో పెరుగుతున్న విద్యుత్తు వాహనాల వినియోగం ★ ఉద్యోగులు, యువకులు, మహిళలే అధికంగా కొనుగోలు

ఈనాడు డిజిటల్, నరసరావుపేట, న్యూస్‌టుడే, నరసరావుపేట అర్బన్

నిన్న మొన్నటి వరకు కేవలం పెద్ద నగరాలకే పరిమితమైన ఈవీ (విద్యుత్తు వాహనాల) వినియోగం నేడు పట్టణాలకూ పాకింది. జిల్లాలో మూడేళ్లగా ఈవీ అమ్మకాలు పెరుగుతూ వస్తున్నాయని షోరూంల యజమానులు చెబుతున్నారు. శబ్దాలు చేయకుండా రోడ్లపై దూసుకుపోవడంతో పాటు నిర్వహణ ఖర్చు భారీగా తగ్గడంతో వీటిని కొనేందుకు ఆసక్తి కనబరుస్తున్నారని తెలుస్తోంది. ఉద్యోగులు, మహిళలు, డెలివరీ బాయ్స్, విశ్రాంత ఉద్యోగులు వీటిని అధికంగా వినియోగిస్తున్నారు. తమ వద్ద కొనేవారంతా వారేనని షోరూం యజమానులు పేర్కొంటున్నారు.


ఛార్జింగ్‌తో ఈవీ స్కూటీ

జిల్లాలో ఈవీలు (సుమారుగా)	
ద్విచక్ర వాహనాలు	9,500
కార్లు	2,950
ఆటోలు	1155
ట్రావెల్ బస్సులు	2

ఏర్పాటుకు రాయితీ

నరసరావుపేటలో ఈవీ ఆటోలు ఇప్పుడిప్పుడే రోడ్లపై ఎక్కువగా కనిపిస్తున్నాయి. పెట్రోల్ ఖర్చు తగ్గుతోందని, విద్యుత్తు వాహనం వల్ల డబ్బు చాలా ఆదా అవుతోందని డ్రైవర్లు చెబుతున్నారు. ఇంజిన్ మోత లేకుండా విద్యుత్తు వాహనాలు (ఈవీ) రహదారులపై రివ్వుగా దూసుకెళ్తున్నాయి. ఈ విభాగంలో కేవలం ద్విచక్ర వాహనాలు, కార్లే కాకుండా ఆటోలు, బస్సులు కూడా జిల్లాలో ఉండడం విశేషం. పెట్రోల్, డీజిల్‌తో నడిచే వాహనాలతో పోలిస్తే బ్యాటరీ కలిగి ఉండే విద్యుత్తు వాహనాలు కొంచెం ఖరీదైనా.. పట్టణ ప్రాంత వాసులు వీటిని కొనేందుకు ఆసక్తి కనబర్చడానికి కారణం.. పెట్రోల్‌కు అయ్యే ఖర్చు మూడొంతులు తగ్గడమే. దీంతో ఈవీల వాహన షోరూంలు వెలుస్తున్నాయి. అయితే జిల్లాలో ఎక్కడా ఛార్జింగ్ స్టేషన్లు అందుబాటులో లేకపోవడం ఒక లోటు. కేవలం వినియోగదారులు ఇళ్ల వద్దే ఛార్జింగ్ పెట్టుకుంటున్నారు. విద్యుత్తు ఛార్జింగ్ స్టేషన్ ఏర్పాటుకు భారీ ఖర్చు అవుతుండటం వీటి నిర్మాణానికి చాలామంది ముందుకు రావడం లేదని షోరూం యజమానులు చెబుతున్నారు. అయితే తాజాగా ప్రభుత్వం రూ.3 లక్షల రాయితీ ప్రకటించనున్న నేపథ్యంలో ఛార్జింగ్ స్టేషన్ ఏర్పాటు చేస్తే వాహనదారులకు ఉపశమనం కలగనుంది.

డబ్బు ఆదా..

విద్యుత్తు వాహన వినియోగంతో రవాణా వ్యయం భారీగా తగ్గుతోంది. లీటరు డీజిల్‌కు 16-17 కి.మీ. మైలేజీ ఇచ్చే వాహనంతో నెలకు సగటున మూడు వేల కి.మీ. తిరిగితే.. కి.మీ రూ.ఆరేడు ఖర్చు అవుతున్నట్లు వినియోగిస్తున్న వారు చెబుతున్నారు. అదే పెట్రోల్ వాహనమైతే.. రూ.7 నుంచి రూ.8 వరకు అవుతుంటున్నారు. అదే దూరానికి విద్యుత్తు కారు వినియోగిస్తే కి.మీ.కు రూ.1.60 మాత్రమే అవుతుందని విద్యుత్తు శాఖ, నెడ్‌క్యాప్ అధికారులు చెబుతున్నారు. పెట్రోల్, డీజిల్ వ్యయంతో పోలిస్తే విద్యుత్తు వాహనం ఛార్జింగ్ ధర చాలా తక్కువ.

వాహన సామర్థ్యం ఆధారంగా డ్రైవింగ్ లైసెన్స్

గరిష్ఠంగా 25 కి.మీ. లోపు వేగంతో ప్రయాణించే విద్యుత్తు వాహనాలకు లైసెన్స్ అవసరం ఉండదు. అంతకు మించిన వేగంతో వెళ్లే విద్యుత్తు ద్విచక్ర వాహనాలు నడిపేవారికి తప్పనిసరిగా డ్రైవింగ్ లైసెన్స్ ఉండాలి. కొన్ని కంపెనీల అమ్మకాలు పెంచుకునేందుకు మా విద్యుత్తు వాహనం కొంటే బండి నంబరు రిజిస్ట్రేషన్ చేసుకుంటే చాలు.. నడిపేవారికి డ్రైవింగ్ లైసెన్స్ అవసరం లేదని ప్రచారం చేస్తున్నాయి. ఇది సరికాదని, వాహన సామర్థ్యాన్ని అనుసరించే డ్రైవింగ్ లైసెన్స్ అవసరమని రవాణాశాఖ అధికారులు చెబుతున్నారు.

నా వృత్తిపరంగా ఎంతో ఉపయోగం



నేను ఫుడ్ డెలివరీ బాయ్‌గా చేస్తున్నాను. రెండేళ్ల కిందట ఈవీ వాహనాన్ని కొన్నాను. రోజుకు పెట్రోల్‌కే రూ.150 నుంచి రూ.200 అవుతుండేది. అలాంటిది ఇప్పుడు ఈవీతో రోజంతా అంటే సుమారు 90 నుంచి 120 కి.మీ తిరుగుతున్నా రోజుకు రూ.30 మాత్రమే అవుతోంది. అంటే నెలకు రూ.వెయ్యి మాత్రమే. నాలాంటి మధ్యతరగతి వారికి ఈవీ చాలా మేలవుతోంది. **- నరేంద్ర, డెలివరీ బోయ్**



కొనుగోళ్లు పెరుగుతున్నాయి..



మూడేళ్లుగా చూసుకుంటే ఈవీల వినియోగం జిల్లాలో పెరుగుతోంది. నెలకు సుమారు 10 వాహనాల వరకు అమ్ముడుపోతున్నాయి. పెట్రోల్ వాహనాలతో పోలిస్తే వీటికి నిర్వహణభారం ఉండదు. కేవలం ఛార్జింగ్ పెడితే చాలు. ఆర్థికంగా ఇబ్బందిపడేవారు వీటిని కొంటున్నారు. పెట్రోల్ ధరలతో పోలిస్తే ఛార్జింగ్‌తో చాలా డబ్బు ఆదా అవుతోందని వీటిని కొనేందుకు ఆసక్తి చూపిస్తున్నారు.
- శ్రీనివాసమూర్తి, వాహన షోరూం యజమాని

గుంటూరు వెళ్లాలంటే రూ.50 మాత్రమే ఖర్చు



నేను ఇదివరకు ఉపయోగించిన ఆటోకు ఇంధన ఖర్చు భారీగా అవుతుండేది. విద్యుత్తు ఆటో తీసుకున్నప్పటి నుంచి ఖర్చు తగ్గింది. గుంటూరు వెళ్లాలంటే రూ.400 అయ్యేది. ఇప్పుడు కేవలం రూ.50 (విద్యుత్తు బిల్లు) మాత్రమే. రోజుకు 4 గంటలు ఛార్జింగ్ పెడితే 120 కి.మీ. ప్రయాణం చేయొచ్చు. డబ్బులు బాగా ఆదా అవుతున్నాయి. నెలకు ఆటోకు రూ.వెయ్యి మాత్రమే విద్యుత్తు బిల్లు అవుతోంది.
-కుమార్, ఆటోడ్రైవర్

ఎరువుల దుకాణంపై విజిలెన్స్ దాడులు

గురజాల గ్రామీణ, న్యూస్‌టుడే: గోగులపాడు గ్రామంలోని ఎరువుల దుకాణంపై విజిలెన్స్, ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులు దాడులు చేశారు. ఏపీలో నిషేధించిన కలుపు మందు, పురుగుల మందు గుర్తించి సీజ్ చేశారు. వాటి విలువ రూ.72,689 ఉంటుందని అధికారులు తెలిపారు. అలాగే జీ1, జీ2 సర్టిఫికెట్ లేని సుమారు రూ.24,20,167 విలువచేసే బయో మందుల విక్రయాలను నిలుపుదల చేశారు. ఈ దాడుల్లో అధికారులు చంద్రశేఖర్, రమణకుమార్, సంధ్యారాణి పాల్గొన్నారు.


పురుగు మందులను తనిఖీ చేస్తున్న అధికారులు

7, 8 తేదీల్లో రోలర్ స్కేటింగ్ ఎంపికలు

గుంటూరు క్రీడలు, న్యూస్‌టుడే: జిల్లా స్కేటింగ్ అసోసియేషన్ ఆధ్వర్యంలో 36వ అంతర్ జిల్లా రోలర్ స్కేటింగ్ ఎంపికలు జూనియర్, సీనియర్ విభాగాల్లో నిర్వహించనున్నట్లు జిల్లా సంఘ అధ్యక్షురాలు నీలిమ తెలిపారు. పోటీలు మంగళగిరి రోడ్డులోని రామకృష్ణ వెనిజులాలో జరుగుతాయన్నారు.

హత్య చేసి.. గుండెపోటుగా చిత్రీకరించి..

భర్తను హతమార్చిన భార్య, సచివాలయ ఉద్యోగి

విజయపురిసౌత్, న్యూస్‌టుడే: వివాహేతర సంబంధం నేపథ్యంలో భార్య, ప్రియుడు కలిసి భర్తను హత్య చేసి, ఆపై గుండెపోటుగా చిత్రీకరించి.. కుటుంబ సభ్యులను నమ్మించే ప్రయత్నం చేశారు. ఈ కేసుకు సంబంధించి నిందితులను గురువారం పోలీసులు అరెస్టు చేశారు. విజయపురిసౌత్‌లోని పోలీసు స్టేషన్లో మాచర్ల రూరల్ సీఐ నఫీజ్ బాషా, ఎస్సై షేక్ మహమ్మద్ షఫీ వివరాలు వెల్లడించారు. మాచర్ల మండలం తాళ్లపల్లి గ్రామానికి చెందిన ఓర్సు శివయ్య (32) స్థానిక పవర్ గ్రిడ్‌లో ఒప్పంద ఉద్యోగిగా పనిచేస్తున్నాడు. ఆయన భార్య గాయత్రికి అదే గ్రామానికి చెందిన సచివాలయ ఉద్యోగి అమ్మోరయ్యతో సాన్నిహిత్యం ఉంది. గతంలోనే వారిద్దరూ పెళ్లి చేసుకునేందుకు నిర్ణయించుకున్నా పెద్దలు ఒప్పుకోలేదు. గత నెల 30న అర్ధరాత్రి గాయత్రి, అమ్మోరయ్య ఇద్దరూ కలిసి ఉండగా భర్త శివయ్య కంట పడ్డారు. దీంతో కంగారుపడ్డ వారిద్దరూ శివయ్య మొహంపై దిండుతో మొత్తి చంపి, గుండెపోటుగా చిత్రీకరించారు. అయితే మృతుడి తల్లికి అనుమానం వచ్చి విజయపురిసౌత్ పోలీసు స్టేషన్లో ఫిర్యాదు చేసింది. ఎస్సై షేక్ మహమ్మద్ షఫీ దర్యాప్తు చేపట్టి, నిందితులను అరెస్టు చేశారు. నిందితులను కోర్టులో హాజరుపరచగా రిమాండ్ విధించినట్లు సీఐ వివరించారు.


నిందితులతో సీఐ నఫీజ్ బాషా, పోలీసులు

పోలీసులకు సమాచారం ఇచ్చి ఊరెళితే ఇంటికి రక్షణ: ఎస్పీ

నరసరావుపేట టౌన్, న్యూస్‌టుడే : దసరా సెలవుల సందర్భంగా ఇళ్లకు తాళం వేసి ఊళ్లకు వెళ్లే వారు సమాచారం సమీప పోలీసు స్టేషన్లలో తెలియజేయాలని, LHMS AP POLICE యాప్‌లో వివరాలు నమోదు చేసుకోవాలని ఎస్పీ కంచి శ్రీనివాసరావు తెలిపారు. నరసరావుపేట జిల్లా పోలీసు కార్యాలయంలో గురువారం ఆయన వివరాలు ప్రజలకు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. చిరునామాతో పాటు చరవాణి సంఖ్య నమోదు చేసి ఆన్‌లైన్‌లో రిజిస్ట్రేషన్ చేసుకుంటే సీసీ కెమెరా పర్యవేక్షణతో రక్షణ కల్పిస్తామని చెప్పారు.

జిల్లాకు 5 డిజిటల్ రీసోర్స్ సెంటర్లు

- బీసీ వసతి గృహాల్లో అభ్యసన సామర్థ్యాలు పెంచే ఏర్పాటు
- పదో తరగతి విద్యార్థులకు ట్యూటర్ల నియామకం

ప్రీ మెట్రిక్ బీసీ సంక్షేమ వసతి గృహాల సంఖ్య **20**
వాటిల్లో చదువుతున్న విద్యార్థులు **1702**

వినుకొండ, న్యూస్‌టుడే

వెనుకబడిన తరగతుల (బీసీ) సంక్షేమ వసతి గృహ విద్యార్థుల్లో అభ్యసన సామర్థ్యాల మెరుగుకు రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటోంది. మొదట ఎంపిక చేసిన చోట డిజిటల్ రీసోర్స్ సెంటర్లు ఏర్పాటు చేస్తుంది. పాఠ్యాంశాలు సులువుగా అర్థమయ్యేలా డిజిటల్ సమాచారాన్ని పెన్ డ్రైవ్‌ల ద్వారా అందుబాటులో ఉంచనున్నారు. సొంత భవనాలున్న చోట ఓ గదిని ఆహ్లాదంగా తీర్చిదిద్దుతారు. అందులో డిజిటల్ ఇంటరాక్టివ్ బోర్డు అమర్చుతారు. ఇందుకు సుమారు రూ.కోటి వరకు ఖర్చు అవుతుందని అంచనా. పల్నాడు జిల్లాలో ఐదు చోట్ల ఏర్పాటు చేయాలని అధికారులు ప్రతిపాదనలు ప్రభుత్వానికి పంపారు.


వినుకొండలో బీసీ బాలుర సంక్షేమ వసతి గృహం

✪ వసతి గృహాలు తినడానికి, పడుకోవడానికి మాత్రమే కాకుండా బడి నుంచి వచ్చిన తర్వాత వివిధ సబ్జెక్టుల్లో వెనుకబడిన వారిపై ప్రత్యేక శ్రద్ధ పెట్టనున్నారు. సులువుగా అర్థమయ్యేలా పాఠ్యాంశాలను డిజిటల్ విధానంలో వివరించడంతో పాటు పదో తరగతి విద్యార్థులకు అనుమానాలు నివృత్తి చేయడంతో పాటు బోధనకు ట్యూటర్లను నియమించారు. పది మంది పిల్లలుంటే గణితం, సైన్స్, ఆంగ్లం, హిందీ సబ్జెక్టులు బోధిస్తారు. ఒక్కొక్క ట్యూటర్‌కు నెలకు రూ.1500 చెల్లిస్తారు.

జిల్లాలో..ఇలా..

జిల్లాలో ప్రీ మెట్రిక్ బీసీ సంక్షేమ వసతి గృహాలు 20, పోస్టుమెట్రిక్ 14 ఉన్నాయి. అన్నింటిలో కలిపి 2845 మంది విద్యార్థులున్నారు. డివిజన్ల వారిగా పరిశీలిస్తే నరసరావుపేటలో 12, సత్తెనపల్లి 12, మాచర్ల 10, ఇలా మొత్తం 34 నడుస్తున్నాయి. అందులో 10కి సొంత భవనాలుండగా వీటిల్లో రాజుపాలెం, వినుకొండ, కోటప్పకొండ, దొడ్లేరు (బాలురు) మాచవరం (బాలికలు) ప్రీ మెట్రిక్ వసతి గృహాల్లో డిజిటల్ రీసోర్స్ సెంటర్లు ఏర్పాటు చేయాలని ప్రతిపాదనలు పంపారు. నవంబరు 14న బాలల దినోత్సవం సందర్భంగా వీటిని ప్రారంభించేందుకు ప్రయత్నాలు చేస్తున్నారు.

అనుమతి రావాలి


ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు ఐదు చోట్ల డిజిటల్ రీసోర్స్ సెంటర్లు ఏర్పాటుకు ప్రతిపాదనలు పంపాం. అనుమతి రాగానే ప్రారంభిస్తాం.
– శివనాగమల్లేశ్వరరావు, జిల్లా బీసీ సంక్షేమాధికారి

కొలువుదీరిన పరమేశ్వరుని కోవెల



దేవీ శరన్నవరాత్రులు పురస్కరించుకుని జిల్లా కేంద్రమైన నరసరావుపేట శ్రీవాసవి కన్యకా పరమేశ్వరి దేవస్థానాన్ని సర్వాంగ సుందరంగా ముస్తాబు చేశారు. ఆలయం ఎదుట మల్లమ్మ సెంటర్ నుంచి సత్తెనపల్లి రోడ్డు వైపు మండపాన్ని ఆకర్షణీయంగా రూపొందించారు. స్వాగత ద్వారం పరమేశ్వరుని కోవెల ఆకారంలో ఆకట్టుకుంటోంది. **-న్యూస్‌టుడే, నరసరావుపేట టౌన్**

సాగర్ కుడి కాలువ పరిశీలన



కాలువ పరిశీలిస్తున్న అధికారులు

విజయపురిసౌత్, న్యూస్‌టుడే: నాగార్జున సాగర్ ప్రాజెక్టు కుడి కాలువ ద్వారా విడుదల వుతున్న నీటిని అధికారులు గురువారం పరిశీలించారు. కుడి కాలువకు ఇప్పటి వరకు 10,000 క్యూసెక్కుల నీరు విడుదల అవుతుండగా గురువారం 500 క్యూసెక్కులు పెంచారు. అనంతరం కుడి కాలువ గేజ్ రీడింగ్ చూశారు. ఈ సందర్భంగా సాగర్ ప్రాజెక్టు గేట్స్ డీఈ మురళీధర్ మాట్లాడుతూ సాగర్ జలాశయానికి ఎగువ నుంచి భారీగా వరద వస్తుండటంతో కుడి కాలువకు నిరంతరాయంగా నీటిని విడుదల చేస్తున్నట్లు పేర్కొన్నారు. మెయిన్ కెనాల్ మానిటరింగ్ ఏఈఈ వెంకటసుబ్బయ్య, సాగర్ ప్రాజెక్టు గేట్స్ ఏఈఈ అనితశ్రీ పాల్గొన్నారు.

ట్రాక్టర్‌ను ఢీకొన్న లారీ.. ఇద్దరి మృతి

నలుగురికి తీవ్ర గాయాలు


గోపాల్ (పాత చిత్రం)


చినగోపినాయక్ (పాత చిత్రం)

పిడుగురాళ్ల: వాళ్లందరూ నిరుపేదలే.. రెక్కాడితే కాని డొక్కాడదు.. కొత్తగా నిర్మాణం చేసే భవనానికి స్లాబ్ వేయడానికి కలిసి వెళ్లారు.. తిరిగి పట్టణానికి వస్తుండగా ఊహించని ప్రమాదం జరిగింది. ఈ ఘటనలో ఇద్దరు మృతి చెందగా.. నలుగురు గాయపడ్డారు. ఈ ఘటన గురువారం పిడుగురాళ్ల మండలం బ్రాహ్మణపల్లి జడ్పీ ఉన్నత పాఠశాల సమీపంలో చోటుచేసుకుంది. పోలీసుల వివరాల ప్రకారం పిడుగురాళ్ల పట్టణంలోని ప్రజాశక్తినగర్, సీతారామపురం తండా ప్రాంతాలకు చెందిన ఆరుగురు కార్మికులు నారాయణపురంలో కొత్తగా నిర్మాణం చేసే భవనం కప్పు వేయటానికి వెళ్లారు. కప్పు పనులు పూర్తైన తర్వాత తిరిగి ట్రాక్టరు ట్రక్కుకు మిల్లరు తగిలించుకుని, స్లాబ్ నిర్మాణ సామగ్రి ట్రక్కులో వేసుకొని కార్మికులు అందులోనే కుర్చొని బయలుదేరారు. బ్రాహ్మణపల్లి సమీపంలోని జడ్పీ ఉన్నత పాఠశాల సమీపంలోకి రాగానే ట్రాక్టరుకు గేదె అడ్డువచ్చింది, గేదెను తప్పించటానికి డ్రైవరు ట్రాక్టరును పక్క తీశారు. అదే సమయంలో వెనుక నుంచి లారీ వచ్చి ఢీకొంది. దీంతో ట్రాక్టరు, ట్రక్కు రోడ్డుపై అడ్డంగా తిరగపడ్డాయి. ట్రక్కులో ఉన్న ఇనుప సామగ్రి కార్మికులపై పడి గాయపడ్డారు.. ఈ ఘటనలో యేసవరపు గోపాల్ (32) వి.చిన గోపినాయక్(70)కు బలమైన గాయాలయ్యాయి. దాంతోపాటు స్వామినాయక్, కృష్ణ, చల్లా తిరుపతయ్య, జాజ్యం ఆదినారాయణ గాయపడ్డారు. పట్టణ సీఐ ఎస్.వెంకట్రావు ఘటన స్థలానికి వెళ్లి క్షతగాత్రులను అంబులెన్సులో గురజాల ప్రభుత్వ ఆసుపత్రికి పంపారు. ఆసుపత్రికి వెళ్లేలోపే గోపాల్ మృతి చెందాడు. గురజాల నుంచి వి.చినగోపినాయక్‌ను గుంటూరు ప్రభుత్వ ఆసుపత్రికి తరలిస్తుండగా మార్గమధ్యలో మృతి చెందాడు. మిగిలిన నలుగురిని నరసరావుపేట ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. ఈ ఘటనతో ప్రజాశక్తినగర్, సీతారామపురం తండాల్లో విషాద ఛాయలు నెలకొన్నాయి.

బ్రాయిలర్ ధరలు (కిలో ఒకి రూ.లలో)

వెన్‌కాబ్: బ్రాయిలర్ ఫారం లిఫ్టింగ్ ధర - 121, రిటైల్ ధర - 143, చికెన్ విత్‌స్కిన్ - 207, చికెన్ స్కిన్‌లెస్ - 236.
కృష్ణా జిల్లాలో: వెన్‌కాబ్: బ్రాయిలర్ ఫారం లిఫ్టింగ్ ధర -118 రిటైల్ ధర 140 చికెన్ విత్ స్కిన్ - 203, చికెన్ స్కిన్‌లెస్ - 231.
అమరావతి పౌల్ట్రీ ఫార్మర్స్ & ట్రేడర్స్ వెల్ఫేర్ అసోసియేషన్: బ్రాయిలర్ ఫారం లిఫ్టింగ్ ధర - 123, 132, 142 చికెన్ విత్ స్కిన్ - 230 చికెన్ స్కిన్‌లెస్ - 240.

నెక్ సూచించిన కోడిగ్రుడ్లు ధర

ఈరోజు నెక్ విజయవాడ జోన్ సూచించే ప్లాస్టిక్ ట్రే ఫారం- గేటు గుడ్లు ధర 100 గుడ్లకు రూ. 535 (వాణిజ్యం & పరిశ్రమల సమాచారం కోసం) ★ నెక్ విజయవాడ. ఈరోజు ఫారం కోడి ధర కిలో రూ.84/-.

నరసరావుపేట

• నరసరావుపేట • వినుకొండ • చిలకలూరిపేట



రాత్రీ, పగలు వెలుగులే

వినుకొండ రూరల్, న్యూస్‌టుడే : జనాలు ఉంటే చోట రాత్రివేళ చీకటిగా ఉంది.. విద్యుత్తు దీపాలు వేయండని మొత్తుకున్నా అధికారులు కనికరించరు. అసలు ప్రజలు నివసించని, ఇంటి నిర్మాణాలు చేస్తున్న జాలలపాలెం పట్టణ గృహ నిర్మాణాల వద్ద పగలు, రాత్రి తేడా లేకుండా విద్యుత్తు దీపాలు వెలుగుతూనే ఉన్నాయి. దీనిపై ఎవరిని అడిగినా మాకు సంబంధం లేదని సమాధానం ఇస్తున్నారు.

పగలే వెలుగుతున్న విద్యుత్తు దీపాలు

రక్తదాతకు సన్మానం

వినుకొండ, న్యూస్‌టుడే : రక్తదానంతో పాటు సామాజిక సేవలకు గుర్తుగా మాజీ మున్సిపల్ కౌన్సిలర్ పీవీ సురేష్ వరల్డ్ హ్యూమన్ రైట్స్ ప్రొటెక్షన్ కమిషన్ నుంచి గౌరవ డాక్టరేట్ అందుకోవడం అభినందనీయమని శాసనసభ్యుడు జీవీ ఆంజనేయులు అన్నారు. తెదేపా కార్యాలయంలో గురువారం సురేష్‌ను మాజీ ఎమ్మెల్యే మక్కెన మల్లికార్జునరావుతో కలిసి శాలువా కప్పి సన్మానించారు. వందసార్లు రక్తదానం చేసి రికార్డు సృష్టించారని, రానున్న రోజుల్లో మరెన్నో కార్యక్రమాలను ప్రజలకు అందించాలని కోరారు.

మేమున్నాం.. మీకు తోడుగా.. 10 AM to 1 PM

నరసరావుపేట అర్బన్ : 80085 73156
యడ్లపాడు : 8008145652 వినుకొండ గ్రామీణ : 9440009293

? సాయినగర్‌లో మురుగు కాల్వలు శుభ్రం చేయడం లేదు. **-విష్ణు**

? మహంకాళి అలయం పక్క వీధిలో కాలువలు తీయడం లేదు. **- సయ్యద్ సుభాని**

✔ సిబ్బందిని పంపి శుభ్రం చేయిస్తాం. **- జస్వంతరావు, కమిషనర్**

? రాజరాజేశ్వరి నగర్‌లో వీధి దీపాలు వెలగడం లేదు. **- సతీష్**

✔ మరమ్మతులు చేసి దీపాలు మారుస్తాం. **-శేఖర్, పర్యవేక్షకుడు**

– న్యూస్‌టుడే, నరసరావుపేట

? ముక్కెళ్లపాడు- జడ్డావారిపాలెం మధ్య రహదారి అధ్వానంగా మారింది. వర్షం పడితే ప్రయాణం సాగదు. పొలాలకు వెళ్లాలన్నా సాధ్యం కాదు. **-కోటేశ్వరరావు, ముక్కెళ్లపాడు**

✔ నూజండ్ల టు చింతలచెరువు ముక్కెళ్లపాడు, జడ్డావారిపాలెం మీదుగా పంచాయతీరాజ్ రోడుకు ప్రతిపాదనలు పంపాం. నిధులు రాగానే పనులు చేపడతాం. **- అల్లాభక్షు, ఏఈ పంచాయతీ రాజ్ శాఖ**

? కమ్మవారిపాలెం ఎస్టీ కాలనీలో వర్షం పడితే నీరు చేరుతోంది. ప్రతిసారి సురక్షిత ప్రాంతాలకు తరలివెళుతున్నారు. గృహ నిర్మాణాలు లేవు, రహదారులు లేవు. **- గంగినేని బాబు**

✔ కాలనీ సమస్యలు ఉన్నతాధికారుల దృష్టిలో పెట్టాం. వారికి మౌలిక వసతులతో కాలనీ ఏర్పాటుకు ప్రభుత్వం సిద్ధం చేస్తోంది. **-రమేష్‌కుమార్, తహసీల్దార్**

– న్యూస్‌టుడే, నూజండ్ల

మూత బిగించారు

స్పందనకు వందనం

మల్లమ్మ సెంటర్ (నరసరావుపేట), న్యూస్‌టుడే : నరసరావుపేట కోడెల శివప్రసాద్‌రావు స్టేడియంలో మంచినీటి కుళాయికి కొద్దిరోజుల క్రితం మూత విరిగింది. దీంతో మంచినీరు వృథాగా పోతోంది. దీనిపై 'నీటి వృథా పట్టదా' శీర్షిక 'ఈనాడు'లో 1న చిత్రవార్త ప్రచురితమైంది. దీనిపై అధికారులు స్పందించి.. కుళాయికి మూత అమర్చారు.

మరమ్మతులు చేయక... సాగులోకి రాక...

మూలనపడ్డ ఎత్తిపోతల పథకాలు

వేలాది ఎకరాల భూములకు సాగునీటి కష్టాలు

చిలకలూరిపేట గ్రామీణ, న్యూస్‌టుడే

జిల్లాలోని చాలా ప్రాంతాల్లో వాగులపై ఎత్తిపోతల పథకాలు ఉన్నాయి. వీటి ఆధారంగా పంటలు సాగు చేస్తున్న రైతులకు అవి చెడిపోవడంతో ఐదేళ్లుగా కష్టాలు తప్పడం లేదు. గత వైకాపా ప్రభుత్వంలో కనీసం నిధులు కేటాయించక వాటి పరిస్థితి దయనీయంగా మారింది. ఒక్క చిలకలూరిపేట నియోజకవర్గంలో ప్రధానంగా ఓగేరు, కుప్పగంజి, నక్కవాగు, నల్లవాగు పరిధిలో ఎత్తిపోతల పథకాలు ఏర్పాటు చేసుకున్న వాటి కింద వేలాది ఎకరాలు పంటలు సాగు చేసేవారు. అవి మరమ్మతులకు గురి కావడంతో పట్టించుకోక మూలన పడ్డాయి. పసుమర్రులో రెండు పెద్ద పథకాలు ఉన్నాయి. వీటి కింద 5 వేల ఎకరాలకు పైగా అయకట్టు ఉంది. గతంలో రైతులు రెండు పంటలు పండించేవారు. ప్రస్తుతం ఇవి చెడిపోయి వర్షాల మీద ఆధారపడ్డారు. ఇటీవల చెరువుకు నీరు పెట్టుకునేందుకు ఒక పథకాన్ని మరమ్మతులు చేసినా అది తిరిగి యథాస్థితికి చేరింది.



పసుమర్రు ఎత్తిపోతల వద్ద మరమ్మతులకు గురైన పైపులను పక్కన పడవేసిన దృశ్యం

★ ఉమ్మడి గుంటూరు జిల్లాలో మొత్తం 84 పథకాలు చెడిపోగా వీటికి మరమ్మతులు చేస్తే 44 వేల ఎకరాలకు సాగు నీరు అందుతుంది. ప్రస్తుత కూటమి ప్రభుత్వం ప్రతిపాదనలు పంపి నిధులు మంజూరు చేయాలని రైతులు కోరుతున్నారు.

మరమ్మతులు చేపట్టాలి



మా గ్రామంలో 2005లో అప్పటి తెదేపా ప్రభుత్వం రెండు పథకాలు ఏర్పాటు చేసింది. వీటి కింద 5900 ఎకరాల ఆయకట్టు సాగు ఉంది. 14 ఏళ్లు పంటలు పండించాం. గత వైకాపా ప్రభుత్వంలో కనీసం మరమ్మతులకు నోచుకోక రెండు పథకాలు మూలనపడ్డాయి. అధికారులు స్పందించి మరమ్మతులు చేపడితే ఇబ్బందులు తొలగుతాయి.

-గుదే రవితేజ, పసుమర్రు

ఈపూరు ఎక్సైజ్ సీఐగా వెంకటేశ్వర్లు

ఈపూరు : ఈపూరు ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ సర్కిల్ సీఐగా డి.వెంకటేశ్వర్లు, ఎస్సైగా కె.శ్రీనివాసరావు గురువారం ఉద్యోగ బాధ్యతలు స్వీకరించారు. ఇక్కడ ఎస్సైగా పని చేస్తున్న స్వర్ణ రేవతి నెల్లూరు జిల్లా కందుకూరుకు బదిలీ అయ్యారు. అక్కడ సీఐగా పని చేస్తున్న డి.వెంకటేశ్వర్లు, పెదకూరపాడు ఎస్సైగా పని చేస్తున్న కె.శ్రీనివాసరావు బదిలీపై ఈపూరు వచ్చారు.

మున్సిపల్ డీఈగా రఫీ బాధ్యతల స్వీకరణ

నరసరావుపేట సెంట్రల్: నరసరావుపేట మున్సిపల్ డీఈగా షేక్ రఫీ గురువారం బాధ్యతలు స్వీకరించారు. ఈయన గుంటూరు నుంచి బదిలీపై నరసరావుపేటకు వచ్చారు. ఇప్పటి వరకు ఇక్కడ డీఈగా పని చేసిన శ్రీనివాసరావు పిడుగురాళ్లకు బదిలీ అయ్యారు.

ఉన్నం సంస్మరణ సభ విజయవంతం చేయండి

నరసరావుపేట సెంట్రల్ : సత్తెనపల్లిలో 6న నిర్వహించనున్న పీకేఎం రాష్ట్ర కోశాధికారి ఉన్నం నాగేశ్వరరావు సంస్మరణ సభ విజయవంతం చేయాలని ప్రజా సంఘాల నాయకులు కోరారు. ఇస్లాంపేటలో గురువారం సభ కరపత్రాన్ని పౌర హక్కుల సంఘ రాష్ట్ర కార్యదర్శి చిలుకా చంద్రశేఖర్, పీడీఎం రాష్ట్ర నాయకులు వై.వెంకటేశ్వరరావు, నల్లపాటి రామారావు ఆవిష్కరించారు.

రోగుల కోసమా... సొంత అవసరాలకా...


నరసరావుపేట సెంట్రల్, న్యూస్‌టుడే : సాధారణంగా వైద్యశాలల్లో స్ట్రెచర్‌లో రోగులను తీసుకెళ్లడం చూస్తుంటాం. కానీ జిల్లా కేంద్రమైన నరసరావుపేటలో పల్నాడు రోడ్డులో ఉన్న ఏరియా వైద్యశాలలో దీనిపై మంచి నీటి బాటిల్స్ పెట్టుకొనడానికి, సొంత అవసరాలకు వినియోగించుకుంటున్నారు. ఇక్కడ జిల్లా అధికారులు తమ కార్యకలాపాలు కొనసాగిస్తుంటారు. వైద్య అధికారులు స్పందించి వీటిని రోగులకు వినియోగించాలని పలువురు కోరుతున్నారు.



స్ట్రెచర్‌పై వాటర్ బాటిల్స్ నిల్వ చేసిన దుకాణదారులు (సర్కిల్‌లో)

వరద బాధితులకు రూ.3 లక్షల విరాళం

వినుకొండ, న్యూస్‌టుడే : వరద బాధితుల సహాయార్థం జిల్లా డీఎల్‌డీఏ చైర్మన్ లగడపాటి వెంకట్రావు శాసనసభ్యుడు జీవీ ఆంజనేయులుతో కలిసి గురువారం ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడును కలిసి రూ.3 లక్షలు విరాళం అందజేశారు. నందమూరి అభిమానుల సంఘం నాయకుడు లగడపాటి శ్రీనివాసరావు, నాయకులు ఉన్నారు.



ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడుకు చెక్కు అందజేస్తున్న డీఎల్‌డీఏ జిల్లా ఛైర్మన్ లగడపాటి వెంకట్రావు, పక్కన ఎమ్మెల్యే జీవీ ఆంజనేయులు

చరిత్ర మరిచిపోలేని మహనీయులు గాంధీ, మోక్షగుండం

చిలకలూరిపేట పట్టణం, న్యూస్‌టుడే : ప్రజల హృదయాల్లో చెరగని ముద్రవేసిన మహనీయులు మహాత్మాగాంధీ, ప్రఖ్యాత ఇంజనీర్ మోక్షగుండం విశ్వేశ్వరయ్య అని ఎమ్మెల్యే ప్రత్తిపాటి పుల్లారావు కొనియాడారు. చిలకలూరిపేట పురపాలక సంఘ కార్యాలయ ఆవరణలో వారి విగ్రహాలను ఆయన గురువారం ప్రారంభించి మాట్లాడారు. అహింసావాదాన్నే జాతి నినాదంగా మార్చి... రక్తపు చుక్క నేల రాలకుండా ఇంత పెద్ద దేశానికి స్వేచ్ఛా, స్వాతంత్ర్యాలు సాధించి పెట్టిన మహోన్నత వ్యక్తి గాంధీజీ అని, శాంతిమార్గంలో ఏదైనా సాధించవచ్చని నిరూపించారన్నారు. అలాగే రహదారులు, ప్రాజెక్టులకు ఇంజినీరింగ్ సేవ చేసి దేశాభివృద్ధికి మోక్షగుండం విశ్వేశ్వరయ్య పాటుపడ్డారని, ఇంజినీరింగ్ విభాగానికి ఎంతో పేరు తెచ్చిన వ్యక్తి అని ప్రశంసించారు. లైసెన్స్‌డ్ ఇంజినీర్లు, సర్వేయర్లు అసోసియేషన్ ఆధ్వర్యంలో విగ్రహాలు ఏర్పాటు చేశారు. పురపాలక సంఘ ఛైర్మన్ ఎస్‌కే రఫాని, కమిషనర్ శ్రీహరిబాబు, డీఈఈ వెంకటరమణ, ఏఈ శ్రీనివాసరావు, జనసేన నియోజకవర్గ కన్వీనర్ తోట రాజా రమేష్, మున్సిపల్ సిబ్బంది, కౌన్సిలర్లు, తెదేపా నాయకులు పాల్గొన్నారు.



గాంధీజీ విగ్రహాన్ని ఆవిష్కరించిన అనంతరం ప్రసంగిస్తున్న ఎమ్మెల్యే ప్రత్తిపాటి పుల్లారావు

ఎమ్మెల్యే ప్రత్తిపాటిని కలిసిన అధికారులు

చిలకలూరిపేట పట్టణం : చిలకలూరిపేటకు బదిలీపై వచ్చిన అధికారులు ఎమ్మెల్యే ప్రత్తిపాటి పుల్లారావును గురువారం మర్యాద పూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛాలు అందజేశారు. ఎంఈఓ కె.ఎల్.రావు, ఎక్సైజ్ అండ్ ప్రొహిబిషన్ సీఐ కె.వినయ్‌కుమార్, ఎస్సై ఎం.గురవేశ్వరి కలిసినవారిలో ఉన్నారు.

ఘర్షణలతో ప్రశాంత జీవితంలో అలజడి

గణపవరం (నాదెండ్ల), న్యూస్‌టుడే : గొడవలతో ప్రశాంత జీవితంలో అలజడి చెలరేగుతుందని, పోలీసు స్టేషన్ల చుట్టూ తిరుగుతూ విలువైన సమయాన్ని వృథా చేసుకోకూడదని నరసరావుపేట డీఎస్పీ కె.నాగేశ్వరరావు అన్నారు. నాదెండ్ల మండలం గణపవరంలో ఫ్రెండ్లీ పోలీసు కార్యక్రమాన్ని గురువారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ చిన్నపాటి వివాదాలను గ్రామ పెద్దల సమక్షంలో పరిష్కరించుకోవడం మంచిదన్నారు. గ్రామాభివృద్ధి పనుల్లో ప్రజలు భాగస్వాములు కావాలని చెప్పారు. ఎస్సై జి.పుల్లారావు, పెద్దలు కెల్లంపల్లి అచ్చయ్య, పెంట్యేల శేషగిరిరావు, హనుమంతరావు, గంగా ప్రసాదు, కంచర్ల శ్రీనివాసరావు, గాలి బుచ్చయ్య, నరసింహారావు, కాట్రు కృష్ణ పాల్గొన్నారు.



గ్రామపెద్దలతో మాట్లాడుతున్న డీఎస్పీ నాగేశ్వరరావు

సత్ర నిర్మాణానికి రూ.లక్ష అందజేత

చిలకలూరిపేట పట్టణం, న్యూస్‌టుడే: కోటప్పకొండలో నిర్మితమవుతున్న కుమ్మరి శాలివాహన, ప్రజాపతి సత్రానికి అజ్ఞాత భక్తుడు రూ.లక్ష విరాళం అందజేశాడు. ఈ సందర్భంగా పట్టణంలోని సంఘ కార్యాలయంలో గురువారం చిలకలూరిపేట నియోజకవర్గ కుమ్మరి శాలివాహన, ప్రజాపతి సంఘ అధ్యక్షుడు నిడమానూరు హనుమంతరావు వివరాలు వెల్లడించారు. ప్రఖ్యాత పుణ్యక్షేత్రం కోటప్పకొండలో సత్ర నిర్మాణం కొనసాగుతుందని, ఓ గది నిర్మాణానికి అయ్యే మొత్తం ఖర్చును అజ్ఞాత భక్తుడు ఇస్తున్నట్లు తెలిపారు. సత్ర నిర్మాణ కమిటీ అధ్యక్షుడు రంగయ్య, కోశాధికారి జి.శివయ్యకు నగదు అందజేశారు.



నూజండ్ల : జగన్మాత పీఠంలో



చిలకలూరిపేటలో..



గంటావారిపాలెంలో..



బాల అలంకారంలో రొంపిచర్ల వాసవీ అమ్మవారు



వినుకొండ : వాసవి అమ్మవారి మూలవిరాట్



కన్యకా పరమేశ్వరి ఆలయంలో



పాతూరులో ..

వైభోగం.. వైభవం

ఘనంగా దసరా శరన్నవ రాత్రి ఉత్సవాలు ప్రారంభం

నూజండ్ల : రవ్వారం శ్రీ వెంకటేశ్వర జగన్మాత పీఠంలో మొదటి రోజు అమ్మవారిని బాల త్రిపుర సుందరీదేవిగా అలంకరించి పూజలు చేశారు. జడ్డావారిపాలెంలో నీలంపాటి లక్ష్మి అమ్మవారు, రౌద్రుల అంకమ్మ అమ్మవారి దేవాలయాల్లో ఇదే అలంకారం చేశారు.

వినుకొండ రూరల్ : విఠంరాజుపల్లిలోని సాయిబాబా ఆలయం వద్ద శాంతి ఆశ్రమం ట్రస్ట్, హిమాలయ గురూజీ ఆధ్వర్యంలో దేవీ శరన్నవ రాత్రుల ఉత్సవాలు నిర్వహించారు. గురువారం బాలా త్రిపుర సుందరీదేవిగా అమ్మవారు దర్శనమిచ్చారు.

చిలకలూరిపేట పట్టణం : చిలకలూరిపేటలో శారదాంబ దేవాలయంలో బ్రాహ్మీ అలంకరణ, గంగాపార్వతి సమేత ఉమా మహేశ్వరస్వామి దేవాలయంలో లలితా పరమేశ్వరిగా, దాసరికాలనీ కనకదుర్గ దేవాలయంలో పార్వతీదేవిగా అమ్మవారు భక్తులకు దర్శనమిచ్చింది. ప్రసాదాలు పంచారు.

శావల్యాపురం : మండలంలోని గంటావారిపాలెం శ్రీ లక్ష్మీతిరుపతమ్మ దేవాలయం, శావల్యాపురం శ్రీ కనకదుర్గమ్మ దేవాలయం, శ్రీనిదానంపాటి లక్ష్మీ ఆలయాల్లో అమ్మవారు బాల త్రిపుర సుందరి దేవీగా దర్శనమిచ్చారు.

రొంపిచర్ల : రొంపిచర్ల వాసవీ అమ్మవారు భక్తులకు బాల అలంకారంలో దర్శనం ఇచ్చారు. విప్పర్ల వల్లభేశ్వరస్వామి ఆలయంలో కామాక్షి బాలాత్రిపుర సుందరి దేవీగా పూజలందుకున్నారు. వడ్లమూడివారిపాలెంలోని గంగా పార్వతి సమేత నీలకంఠ స్వామి దేవస్థానంలో పార్వతీదేవి సువర్ణదేవిగా, శ్రీ చౌడేశ్వరి అమ్మవారు బాల త్రిపురసుందరీదేవిగా భక్తులకు దర్శనం ఇచ్చారు.

వినుకొండ : వినుకొండ బోసుబొమ్మ సెంటర్లోని వాసవి అమ్మవారిని వెండి ఆభరణాలతో అలంకరించారు. కల్యాణ మండపంలో బాలాత్రిపుర సుందరిదేవి రూపంలో అమ్మవారు దర్శనిమిచ్చారు.



పాతూరు శివాలయంలో అంకురార్పణ పూజలు

అదనపు భారం.. ఇక దూరం

చెత్త సేకరణ పన్ను వసూళ్లు నిలిపివేత

న్యూస్‌టుడే, నరసరావుపేట వ్యవసాయం

వైకాపా పాలనలో ప్రవేశపెట్టిన చెత్త సేకరణ రుసుముల భారం నుంచి ప్రజలకు గాంధీ జయంతి రోజున ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు విముక్తి కల్పించారు. ఇకపై చెత్త పన్ను వసూలు చేయకూడదని ప్రకటించడంతో ప్రజలు సంతోష పడుతున్నారు. ఇంటింటా తడి, పొడి చెత్త సేకరణ పేరిట ఒక నరసరావుపేట పురపాలక సంఘంలో ప్రతి నెలా రూ.17 లక్షల మేర వసూలు చేశారు. ఇంటింటి చెత్త సేకరణలో భాగంగా ప్రతి ఇంటి నుంచి నెలకు రూ.60, అపార్ట్‌మెంట్ల నుంచి రూ.90 చొప్పున వైకాపా ప్రభుత్వం వసూలు చేసింది. ఇలా ఏడాదికి సుమారు రూ.2 కోట్ల మేర వసూలు చేసింది. దీనిపై ప్రజల్లో వ్యతిరేకత వచ్చినా చెల్లించక తప్పలేదు. సార్వత్రిక ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీ మేరకు కూటమి ప్రభుత్వం ఈ విధానానికి స్వస్తి పలికింది.

నెలకు రూ.720 భారం

పురపాలిక పరిధిలోని ఇళ్లకు రూ.60 చొప్పున వసూలు చేస్తున్నారు. ఈ నేపథ్యంలో సంవత్సరానికి సాధారణ ప్రాంతాల్లో ఉన్నవారికి రూ.720, అపార్టుమెంట్లలో నివసించేవారు రూ.1080, పేదల కాలనీలో ఉన్నవారు రూ.360 చొప్పున అదనపు భారం పడింది. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక చెత్తపన్ను వసూలు చేయలేదు. ఇప్పుడు చంద్రబాబునాయుడు ఈ పన్ను రద్దు చేయటంతో ప్రజలు ఊపిరి పీల్చుకుంటున్నారు.



అందుబాటులోకి తీసుకువచ్చిన సంపద కేంద్రం

డంపింగ్ యార్డులు నిర్వీర్యం

వైకాపా అధికారంలోకి వచ్చాక 2021 అక్టోబరులో ఇంటింటి నుంచి చెత్త సేకరణ ప్రారంభించారు. అయినా పట్టణంలో పారిశుద్ధ్యం మెరుగుపడిందేమీ లేదు. చెత్త విషయంలో ప్రజలపై ఆర్థిక భారం మోపిన వైకాపా ప్రభుత్వం చెత్త నుంచి సంపద తయారీ కేంద్రాలను ఐదేళ్ల పాలనలో పూర్తిగా నిర్వీర్యం చేసింది. 2014- 19 తెదేపా అధికారంలో స్వచ్ఛ గ్రామాల కోసం జిల్లాలో 526 పంచాయతీల పరిధిలో 409 గ్రామాల్లో చెత్త సంపద తయారీ కేంద్రాలను ఏర్పాటు చేసి 1850 మంది హరిత రాయబారులను నియమించి.. సుమారు 300 మెట్రిక్ టన్నుల వ్యర్థాలను సేకరించారు. వారికి నెలకు రూ.6 వేలు వేతనం అందించేలా చర్యలు తీసుకున్నారు. పంచాయతీలపై భారం లేకుండా నేరుగా ప్రభుత్వమే వారి బ్యాంకు ఖాతాలకు వేతనం జమ చేసింది. వైకాపా అధికారంలోకి వచ్చాక 2022 అక్టోబరు నుంచి పంచాయతీలే వారికి వేతనాలు అందిస్తున్నాయి. వాటికి సక్రమంగా నిధులు రాక వేతనాలు సక్రమంగా అందలేదు. దీంతో స్వచ్ఛ గ్రామాల లక్ష్యానికి తూట్లు పడ్డాయి. మళ్లీ కూటమి ప్రభుత్వం అధికారంలోకి రావటంతో చెత్త పన్ను భారం నుంచి ప్రజలకు విముక్తి కల్పించి, గ్రామాల్లో చెత్త సంపద తయారీ కేంద్రాల పునరుద్ధరణపై దృష్టి పెట్టింది.



దీక్షలు చేస్తున్న రైతు సంఘాల నేతలు

విశాఖ ఉక్కుపై కూటమి పార్టీలు వైఖరి వెల్లడించాలి

నరసరావుపేట అర్బన్: విశాఖ ఉక్కు కర్మాగారం ప్రైవేటీకరణపై కూటమి ప్రభుత్వంలో ఉన్న పార్టీలు తమ స్పష్టమైన వైఖరిని వెల్లడించాలని ఏపీ రైతు సంఘం నేతలు ఏపూరి గోపాలరావు, ఉలవలపూడి రాములు డిమాండ్ చేశారు. విశాఖ ఉక్కు పరిరక్షణ దీక్షలు గురువారం మూడో రోజు నిర్వహించారు. ఈ సందర్భంగా విశాఖ ఉక్కు ఉద్యమంలో ప్రాణాలు కోల్పోయిన అమరులకు నివాళి అర్పించారు. ఉక్కు కర్మాగారానికి వేలాది ఎకరాలు భూములు రైతులు ఇచ్చారని, అలాగే 32 మంది బలిదానం చేశారన్నారు. ఒకవైపు విశాఖ ఉక్కును బలోపేతం చేస్తామని ఒప్పంద కార్మికులను తొలగించారన్నారు. అలాగే మరో 2500 మందికి వీఆర్ఎస్ ఇచ్చేందుకు సిద్ధమవుతున్నట్లు పేర్కొన్నారు. విశాఖ ఉక్కును మరో సంస్థలో విలీనం, ప్రైవేటీకరణ అంగీకరించేది లేదని స్పష్టం చేశారు తొలగించిన కార్మికులను విధుల్లోకి తీసుకోవాలని కోరారు. రైతు, సంఘాల నేతలు దీక్షలు చేశారు.

అకాల వర్షంతో రైతుల ఆందోళన

నూజండ్ల, న్యూస్‌టుడే : అకాల వర్షంతో రైతులు ఆందోళన చెందుతున్నారు. బుధ, గురువారాల్లో వరసగా కురిసిన వర్షానికి పంట చేలల్లో నీరు చేరింది. వరి నారు మళ్లు దెబ్బతిన్నాయి. రహదారులన్నీ బురదమయంగా మారాయి. నూజండ్ల బస్టాండ్ సెంటర్‌లో నీరు చేరి ప్రయాణికులకు ఇబ్బందిగా మారింది. వర్షం ఇలాగే కొనసాగితే లోతట్టు ప్రాంతాల్లో నీరు నిలవడంతో పంటలు దెబ్బతింటాయని రైతులు ఆందోళన చెందుతున్నారు. కమ్మవారిపాలెం ఎస్టీ కాలనీలోకి వర్షం నీరు చేరుతోంది. వాగులు, వంకలు పొంగి పొర్లుతున్నాయి.



నూజండ్ల బస్టాండ్ సెంటర్‌లో నిలిచిన వర్షం నీరు

రొంపిచర్ల : అప్పటి వరకు భానుడు భగభగలతో అల్లాడిన ప్రజలు ఈదురు గాలులు, ఉరుములతో కూడిన వర్షానికి భయాందోళన చెందారు. మండలంలో గురువారం వర్షానికి ఈదురు గాలులు తోడయ్యాయి. విప్పర్లపల్లి- వడ్లమూడివారి పాలెం రహదారిలో రోడ్డుకు అడ్డుగా చెట్లు పడిపోగా రాకపోకలు నిలిచాయి.

ఆర్టీసీ బస్సు ఢీకొని వ్యక్తి మృతి



పిచ్చయ్య (పాతచిత్రం)

ఈపూరు, న్యూస్‌టుడే : మండలంలోని ఇనుమెళ్లలో ఆర్టీసీ బస్సు ఢీకొన్న సంఘటనలో గుంటుపల్లి పిచ్చయ్య (46) మృతి చెందాడు. పిచ్చయ్య బుధవారం తన ఇంటి నుంచి రోడ్డుపైకి వస్తుండగా నరసరావుపేట డిపో ఆర్టీసీ బస్సు ఢీకొట్టింది. దీంతో పిచ్చయ్య తీవ్రంగా గాయపడ్డాడు. అత్యవసర వాహనంలో నరసరావుపేట తరలించగా చికిత్స పొందుతూ మృతి చెందాడు. మృతుడికి భార్య, ముగ్గురు సంతానం ఉన్నారు. ఆర్టీసీ బస్సును నిర్లక్ష్యంతో వేగంగా నడపడం వల్ల పిచ్చయ్య మృతి చెందినట్లుగా కుటుంబసభ్యులు ఫిర్యాదులో పేర్కొన్నారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై ఉమామహేశ్వరరావు తెలిపారు.

ప్రజలకు ఉపయోగపడే పనులను గుర్తించాలి

నూజండ్ల, న్యూస్‌టుడే : సమాజానికి, ప్రజలకు ఉపయోగపడే పనులు గుర్తించాలని ఏపీవో రాజు అన్నారు. నూజండ్ల సచివాలయంలో ఉపాధి హామీ పథకం పనుల గుర్తింపునకు గురువారం గ్రామసభ నిర్వహించారు. కూలీలకు ఉపాధితో పాటు చేసిన పనులు ఉపయోగకరంగా ఉండాలని సూచించారు. సర్పంచి వీర్ల వెంకటస్వామి, కార్యదర్శి మాల్యాద్రి, క్షేత్ర సహాయకుడు గురవారావు పాల్గొన్నారు.

వినుకొండ రూరల్ : ఉపాధి హామీ పథకంలో ఎవరు దరఖాస్తు చేసినా వారికి పని కల్పించేలా పనులు సిద్ధం చేయాలని డ్వామా ఇన్‌ఛార్జి పీడీ బూసిరెడ్డి అన్నారు. గురువారం మండలంలోని విఠంరాజుపల్లిలో నిర్వహించిన గ్రామసభలో పాల్గొన్నారు.

వీధులు శుభ్రంగా ఉంటేనే గ్రామాల అభివృద్ధి

నరసరావుపేట సెంట్రల్: ప్రతి ఒక్కరు పరిసరాలు పరిశుభ్రంగా ఉంచుకోవాలని డీఆర్‌డీఏ పీడీ బాలునాయక్ అన్నారు. గురువారం ఆయన మండలంలోని లింగంగుంట్లలో జరిగిన స్వచ్ఛతా హీ సేవా కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా పారిశుద్ధ్య సిబ్బందితో కలిసి ఆయన రోడ్లు ఊడ్చి చెత్త, పిచ్చి చెట్లు తొలగించారు. గ్రామాభివృద్ధి కమిటీ నాయకులు గంగుల పెద్దిరెడ్డి, పంచాయతీ కార్యదర్శి కేవీ శివప్రసాద్, ఏపీఎం భరత్, సచివాలయ సిబ్బంది, డ్వాక్రా మహిళలు పాల్గొన్నారు.

నిత్యావసరాలపై దిగుమతి సుంకం తగ్గించాలి

వినుకొండ, న్యూస్‌టుడే : నిత్యావసరాలపై కేంద్రం పెంచిన 20 శాతం దిగుమతి సుంకం వెంటనే రద్దు చేయాలని సీపీఐ జిల్లా కార్యదర్శి

ఏపీ ఈవీ

మారుతీవరప్రసాద్ డిమాండ్ చేశారు. స్తూపం కూడలిలో గురువారం ఆ పార్టీ నిర్వహించిన ధర్నాలో ఆయన పాల్గొన్నారు. నూనెలతో పాటు ఉల్లి, వెల్లుల్లి వంటి సరకుల ధరలు పెరిగి సామాన్యులు పండగ వేళల్లో కొనలేక ఇబ్బంది పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. కేంద్రం తన నిర్ణయాన్ని ఉప సంహరించుకోవాలని.. లేని పక్షంలో పేదల పక్షాన తాము ఆందోళన తీవ్రం చేస్తామని హెచ్చరించారు. సీపీఐ నియోజకవర్గ కార్యదర్శి బూదాల శ్రీనివాసరావు తదితరులు ఆందోళనలో పాల్గొన్నారు.

అదుపు తప్పి డివైడర్‌ను ఢీకొన్న లారీ

వినుకొండ రూరల్, న్యూస్‌టుడే : లారీని నడుపుతూ డ్రైవర్ నిద్రమత్తులోకి జారుకోగా అది అదుపు తప్పి డివైడర్‌ను ఢీకొంది. కర్నూలు- గుంటూరు జాతీయ రహదారిపై అందుగుల కొత్తపాలెంలో గురువారం వేకువన జరిగింది. కర్నూలు నుంచి ఉల్లిపాయలతో గుంటూరు వైపు వెళ్తున్న లోడు లారీ కొత్తపాలెం రాగానే పెద్ద శబ్దం వచ్చింది. పక్క ఇళ్లవారు వెళ్లి చూడగా అదుపు తప్పి డివైడర్‌ను ఢీకొని ఉంది. డ్రైవర్ అదుపు చేయగా పెను ప్రమాదం తప్పింది. లారీ ముందు భాగం ధ్వంసమైంది.

రేషన్ బియ్యం రీసైక్లింగ్ చేస్తే చర్యలు

వినుకొండ, న్యూస్‌టుడే : ప్రభుత్వం పేదలకు సరఫరా చేసే చౌక బియ్యం మిల్లుల్లో రీసైక్లింగ్ చేస్తే చర్యలు తప్పవని తహసీల్దార్ సురేష్‌నాయక్ హెచ్చరించారు. మండల రెవెన్యూ కార్యాలయంలో గురువారం మిల్లర్లతో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ మిల్లులకు అన్ని రకాల అనుమతులు తీసుకోవాలని, అక్రమాలకు పాల్పడొద్దని ఆయన సూచించారు.

రోడ్ల పక్కన చెత్త పోయొద్దు

వినుకొండ : చెత్త నిర్వహణకు పట్టణ పౌరులు సహకరించాలని మున్సిపల్ కమిషనర్ సుభాష్ చంద్రబోస్ కోరారు. స్థానిక ఏనుగుపాలెం రోడ్డులోని కాశీనాయన ఆశ్రమం సమీపంలో రోడ్డు అంచున పోసిన వ్యర్థాలను మున్సిపల్ సిబ్బంది గురువారం తొలగించారు. ఆ ప్రాంతాన్ని సందర్శించిన కమిషనర్ మాట్లాడుతూ వీధి వ్యాపారులు చెత్తను ఇష్టానుసారం పారబోయవద్దని సూచించారు.

ఆధునిక వ్యవసాయ పనిముట్లు రాయితీపై ఇవ్వాలి

ఈపూరు : అంగలూరు, గుండేపల్లి గ్రామాల్లో వ్యవసాయశాఖ అధికారులు గురువారం పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. అధికారులు పైర్లను పరిశీలించి అనంతరం రైతులతో సమావేశం నిర్వహించి సలహాలు సూచనలు ఇచ్చారు. ఏవో రామినేని రామారావు, వ్యవసాయ శాఖ సిబ్బంది రైతులు పాల్గొన్నారు.

బదిలీ ఉద్యోగికి సన్మానం

ఈపూరు : అంకితభావంతో పనిచేసి వినియోగదారులకు సంతృప్తికరమైన సేవలందించిన ఉద్యోగి కలకాలం గుర్తుంటారని ఈపూరు విద్యుత్తు ఏఈ ఎస్.గాంధీబాబు అన్నారు. బదిలీపై వెళుతున్న ఈపూరు సెక్షన్ ఎల్ఐ గడ్డం శ్రీనివాసరావును విద్యుత్తు శాఖ సిబ్బంది గురువారం సన్మానించారు.

సత్తెనపల్లి

• సత్తెనపల్లి • పెదకూరపాడు • మాచర్ల • గురజాల

విజేతలకు సైదయ్య స్మారక అవార్డులు

మాచర్ల (కారంపూడి): రోటరీ క్లబ్ ఆధ్వర్యంలో కోట సైదయ్య స్మారక అవార్డుల ప్రదానోత్సవం కేసీపీ ఆడిటోరియంలో గురువారం నిర్వహించారు. విద్యార్థులకు క్విజ్, వ్యాస రచన, వక్తృత్వ, నృత్య పోటీలు నిర్వహించి బహుమతులు ప్రదానం చేశారు. రోటరీ క్లబ్ అధ్యక్షురాలు కృష్ణకుమారి, సురేఖ, లక్ష్మీ, హనుమంతరావు తదితరులు పాల్గొన్నారు.


అవార్డులు అందజేస్తున్న రోటరీ క్లబ్ సభ్యులు

భక్తిశ్రద్ధలతో మహాలక్ష్మీ హోమం

దుర్గి, న్యూస్‌టుడే: దసరా ఉత్సవాల పురస్కరించుకుని శ్రీనిదానంపాటి అమ్మవారి ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. కుంకుమ పూజలు, అభిషేకాలు, లక్ష్మీగణపతి హోమం, శ్రీమహాలక్ష్మీ హోమం చేశారు. దుర్గి, ఓబులేశునపల్లె, ముటుకూరు, ధర్మవరం గ్రామాల్లో అమ్మవార్లను బాలా త్రిపురసుందరిగా అలంకరించారు.


నిదానంపాటి అమ్మవారి ఆలయంలో హోమం నిర్వహిస్తూ..

మేమున్నాం.. మీకు తోడుగా.. 10 AM to 1 PM

సత్తెనపల్లి: 80085 73171 పెదకూరపాడు: 80088 31888
మాచర్ల గ్రామీణ: 80085 73181 గురజాల: 80085 7 3176

? ఉంగుటూరు - 14వ మైలు రహదారిలో నీరు నిల్వ ఉండి రాకపోకలకు ఇబ్బందులు పడుతున్నాం.
– హరిహరప్రసాద్, ఉంగుటూరు

✔ ఆ మార్గంలోని లోలెవల్ వంతెనల స్థానంలో హైలెవల్ వంతెనలకు ప్రతిపాదనలు పంపించాం. మంజూరు కాగానే నిర్మాణాలు ప్రారంభిస్తాం. - రమేష్‌బాబు, ఏఈ – న్యూస్‌టుడే, అమరావతి

? పాటిబండ్ల తాగునీటి చెరువు సమీపంలో విద్యుత్తు తీగలు కిందకు వేలాడుతున్నాయి. నిత్యం ఈ మార్గంలో పంట ఉత్పత్తులతో ట్రాక్టర్లు, లారీలు తిరుగుతుండటంతో ఎప్పుడు ఏ ప్రమాదం జరుగుతుందోనని గ్రామస్థులు ఆందోళన చెందుతున్నారు.
- రాజారత్నం, గ్రామస్థుడు, పాటిబండ్ల

✔ సిబ్బందిని పంపించి విద్యుత్తు తీగలను సరిచేయిస్తాం.
- రామకృష్ణ, ఏఈ, – న్యూస్‌టుడే, పెదకూరపాడు


వ్యవసాయశాఖ సిబ్బందితో సమీక్షిస్తున్న ఎమ్మెల్యే ప్రవీణ్

రైతులకు మేలు చేయండి

పెదకూరపాడు, న్యూస్‌టుడే: వ్యవసాయాన్ని లాభసాటిగా మార్చేందుకు కూటమి ప్రభుత్వం శక్తివంచన లేకుండా పనిచేస్తోందని, వ్యవసాయశాఖ సిబ్బంది సమన్వయంతో రైతన్నకు మేలు చేయాలని ఎమ్మెల్యే భాష్యం ప్రవీణ్ సూచించారు. గురువారం క్యాంపు కార్యాలయంలో ఐదు మండలాల వ్యవసాయశాఖ సిబ్బందితో సమావేశం నిర్వహించి మాట్లాడారు. అధిక వర్షాలతో పంట నష్టపోయిన రైతుల నుంచి పరిహారం కోసం ఫిర్యాదులు వస్తున్నాయన్నారు. అందరికీ న్యాయం చేయాలన్నారు. ఎరువులు, విత్తనాలు కొరత లేకుండా చూడాలన్నారు.


అచ్చంపేట వాసవీ కన్యక పరమేశ్వరి దేవస్థానంలో అన్నపూర్ణదేవి అలంకరణ
సత్తెనపల్లి: శ్రీలక్ష్మి ప్రత్యంగిర అమ్మవార్ల పీఠంలో బాలా త్రిపురసుందరి అలంకారం
నకరికల్లు: గంగాఅన్నపూర్ణాదేవి
సత్తెనపల్లిలో వాసవీ మాత
పిడుగురాళ్ల: బాలా త్రిపురసుందరిగా కనకదుర్గమ్మ
పెదకూరపాడు: 75త్యాళ్లూరు కాశీవిశ్వేశ్వరస్వామి ఆలయంలో బాలా త్రిపురసుందరి

పాహిమాం.. జగన్మాత

దేవీ శరన్నవరాత్రి ఉత్సవాలు గురువారం ప్రారంభమయ్యాయి. తొలిరోజు పలు ఆలయాల్లో అమ్మవారు బాలా త్రిపురసందరిగా దర్శనమిచ్చారు. చల్లంగా చూడమ్మా అంటూ భక్తులు ప్రణమిల్లారు. ప్రత్యేక పూజలు చేశారు. మహిళలు కుంకుమపూజ నిర్వహించారు.
– న్యూస్‌టుడే, బృందం


సత్తెనపల్లి: కొత్తపేటలో..
మాచవరంలో వాసవీ మాత


పిడుగురాళ్ల: కుంకుమార్చనలో మహిళలు


సత్తెనపల్లి: త్రిశక్తి దుర్గాపీఠంలో..


మాచవరం శివాలయంలో అమ్మవారు
పెదమక్కెనలో వనబాలా దేవిగా అమ్మవారు
కారంపూడి: బాలా త్రిపుర సుందరిగా అంకాళమ్మ
మాచర్లలో వాసవీ కన్యక పరమేశ్వరి
పిడుగురాళ్ల: మత్స్యవతారంలో శ్రీవారు
నకరికల్లు: కన్యకా పరమేశ్వరి

సస్యరక్షణతో తెగుళ్ల నివారణ

బెల్లంకొండ, న్యూస్‌టుడే: పత్తి పంటలో గులాబి రంగు పురుగు నివారణకు ముందస్తు చర్యలు చేపట్టాలని వ్యవసాయాధికారి కృష్ణయ్య తెలిపారు. గురువారం కందిపాడు, చంద్రాజుపాలెం గ్రామాల్లో పొలం పిలుస్తోంది కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా పత్తి నిమ్మ, తదితర పంటలు ఆయన పరిశీలించారు. తెగుళ్ల నివారణకు సస్యరక్షణ చేపట్టాలన్నారు. పశు సంవర్ధక శాఖ అధికారి రామకృష్ణ, మార్కెటింగ్ అధికారి నరసింహస్వామి, నవీన్, జడ్పీటీసీ సభ్యుడు వెంకటరెడ్డి పాల్గొన్నారు.

ఈకేవైసీ నమోదు తప్పనిసరి

క్రోసూరు(అచ్చంపేట): మండలంలోని రైతులందరూ ఆర్బీకేల్లో ఈకేవైసీ చేయించాలని మండల వ్యవసాయాధికారి వేణుగోపాల్ కోరారు. గురువారం ఆయన క్రోసూరు మండలం అనంతవరంలో పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. కౌలురైతులకు గుర్తింపు కార్డులు, పీఎం కిసాన్, రైతు సేవా కేంద్రాల ద్వారా ఎరువుల పంపిణీ గురించి పర్యవేక్షణాధికారి మల్లికార్జునరావు వివరించారు.

పవన్ దీక్షకు సంఘీభావంగా చండీహోమం

సత్తెనపల్లి, న్యూస్‌టుడే: రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ చేపట్టిన ప్రాయశ్చిత్త దీక్షకు సంఘీభావంగా పట్టణంలోని శ్రీలక్ష్మి తిరుపతమ్మతల్లి ఆలయంలో గురువారం చండీహోమాన్ని భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. అమ్మవారికి జనసేన నాయకులు, కార్యకర్తలు పూజలు చేశారు. జనసేన పార్టీ నియోజకవర్గ నాయకుడు బొర్రా వెంకటఅప్పారావు, నాయకులు పాల్గొన్నారు.

జలాల్‌పురం-కంభంపాడు రహదారి పనులు ప్రారంభం

పెదకూరపాడు, న్యూస్‌టుడే: జలాల్‌పురం పరస, కంభంపాడు గ్రామాల రహదారికి మహర్దశ కలగనుంది. ఎమ్మెల్యే భాష్యం ప్రవీణ్ చొరవతో గురువారం ఉపాధి నిధులు రూ.1.50 కోట్లతో పనులు డీఈ వాణినాథ్‌తో కలిసి జిల్లా తెదేపా కార్యదర్శి అర్తిమళ్ల రమేష్ ప్రారంభించారు. నాయకులు బాబు, గోపాలరావు, బ్రహ్మయ్య, సత్యం తదితరులు పాల్గొన్నారు.

సాగునీటి కాలువల మరమ్మతులకు ప్రాధాన్యం

దాచేపల్లి, న్యూస్‌టుడే: గురజాల నియోజకవర్గంలోని మేజర్, మైనర్ కాలువల మరమ్మతులకు రూ.2 కోట్లతో ప్రతిపాదనలు పంపామని ఎమ్మెల్యే యరపతినేని శ్రీనివాసరావు తెలిపారు. గురువారం దాచేపల్లిలో ప్రజాప్రతినిధులు, సాగునీటి అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం నుంచి నిధులు వచ్చేలోపే కాలువల పరిధిలో కమిటీలు వేసి పనులు చేస్తామన్నారు. రైతులు సాగునీటి సమస్య ఎదుర్కొంటున్నారని, దీన్ని అధిగమించేందుకు యుద్ధప్రాతిపదికన పనులు చేయడానికి సిద్ధం చేస్తున్నామని వివరించారు. గత ప్రభుత్వం దోచుకుతిందని, కూటమి ప్రభుత్వం అభివృద్దే ధ్యేయంగా ముందుకు సాగుతోందన్నారు. సమావేశంలో మాజీ ఎమ్మెల్సీ జంగా కృష్ణమూర్తి, కాంతారావు, ఈఈ శ్రీహరి తదితరులు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న ఎమ్మెల్యే యరపతినేని శ్రీనివాసరావు, వేదికపై మాజీ ఎమ్మెల్సీ కృష్ణమూర్తి

పలువురి మృతికి సంతాపం

పిడుగురాళ్ల, న్యూస్‌టుడే: పట్టణ పల్వరైజింగ్ అసోసియేషన్ గౌరవ అధ్యక్షుడు కోట సుబ్బారావు గతవారం చనిపోయారు. ఆయన ఇంటికి ఎమ్మెల్యే యరపతినేని శ్రీనివాసరావు గురువారం వెళ్లి కుటుంబ సభ్యులను పరామర్శించారు. సుబ్బారావు చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. కుమ్మరిపాలేనికి చెందిన సాతర్ల రమణ కొన్నిరోజులు కిందట మృతి చెందగా.. కుటుంబ సభ్యులను పరామర్శించారు.

నిధుల సక్రమ వినియోగంతో ప్రగతి

సత్తెనపల్లి గ్రామీణ, న్యూస్‌టుడే: పల్లెల్లో ప్రాధాన్యతలను గమనించి నిధులు సక్రమంగా వినియోగిస్తే మండల అభివృద్ధి వేగంగా జరుగుతుందని డివిజనల్ అభివృద్ధి అధికారి(డీఎల్‌డీవో) వై.రాజగోపాల్ అన్నారు. సత్తెనపల్లి మండల పరిషత్ సాధారణ సర్వసభ్య సమావేశం గురువారం జరిగింది. ఎంపీపీ షేక్ జైబున్‌బి అధ్యక్షతన స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో జరిగిన ఈ సమావేశంలో డీఎల్‌డీవో మాట్లాడుతూ పింఛన్ల పంపిణీలో మండలం మూడో స్థానంలో నిలిచిందన్నారు. యంత్రాంగం ఇదే రీతిలో సమష్టి కృషిని కొనసాగించి స్థానిక ప్రజాప్రతినిధుల సహకారంతో గ్రామీణులకు పారదర్శక సేవలందించాలన్నారు. వివిధ పనులకు రూ.50 లక్షలు 15వ ఆర్థిక సంఘం నిధులు కేటాయిస్తూ తీర్మానాన్ని సభ్యులు ఆమోదించారు. ఎంపీడీవో జి.వి.సత్యనారాయణ, ఏవో ఎస్.శ్రీధర్‌రెడ్డి, వైద్యాధికారి వి.ప్రదీప్, ఎంఈవో ఎ.శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

విశాఖ ఉక్కు పరిశ్రమ ప్రైవేటీకరణ ఆపాలి


పిడుగురాళ్ల, న్యూస్‌టుడే: విశాఖ ఉక్కు పరిశ్రమ ప్రైవేటీకరణను ఆపాలని, అక్రమంగా తొలగించిన 4 వేల మంది కార్మికులను వెంటనే విధుల్లోకి తీసుకోవాలని కోరుతూ పట్టణంలోని బ్యాంకు సెంటరులో గురువారం ప్రజాసంఘాల ఆధ్వర్యంలో నిరసన కార్యక్రమాన్ని చేపట్టారు. ఈ సందర్భంగా పలువురు ప్రజా సంఘాల నాయకులు మాట్లాడుతూ విశాఖ ఉక్కు పరిశ్రమకు సొంతంగా గనులు ఏర్పాటు చేయాలని, ప్రైవేటీకరణ ఆపకపోతే భవిష్యత్తులో ఉద్యమాలు ఉద్ధృతం చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో సీఐటీయూ నాయకులు శ్రీనివాసరావు, కృష్ణ, రైతు కూలి సంఘం నాయకులు రాంబాబు, వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

న్యాయవాదుల నిరసన

సత్తెనపల్లి, న్యూస్‌టుడే: కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న నూతన న్యాయ చట్టాలను నిరసిస్తూ గురువారం స్థానిక కోర్టుల విధులను న్యాయవాదులు బహిష్కరించి నిరసన తెలియజేశారు. తాలుకా కోర్టు వద్ద జరిగిన నిరసన కార్యక్రమంలో బార్ అసోసియేషన్ అధ్యక్షుడు కంబాల అనిల్‌కుమార్ మాట్లాడుతూ నూతన చట్టంతో న్యాయవాదులకు తీవ్ర నష్టం కలుగుతుందన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు స్పందించి న్యాయవాదుల హక్కుల్ని కాపాడాలని ఆయన డిమాండ్ చేశారు. న్యాయవాదులు శ్రీనివాసరావు, రవి, వెంకటేశ్వరరావు, వెంకటకోటయ్య, వీరభాస్కరరెడ్డి, ఆదినారాయణ, చినసత్యనారాయణ, చిన్నయ్య, జ్ఞాన్‌రాజ్‌పాల్, శివనాగేశ్వరరావు, బాలకోటయ్య తదితరులు పాల్గొన్నారు.

అందుబాటు ధరల్లో గృహోపకరణాలు

అమరావతి, న్యూస్‌టుడే: ప్రముఖ ఎలక్ట్రానిక్ గృహోపకరణాల సంస్థ విజయ్ డిజిటల్స్ షోరూమ్ అమరావతిలో గురువారం ప్రారంభమైంది. ఎమ్మెల్యే భాష్యం ప్రవీణ్ హాజరై ప్రారంభించారు. సంస్థ ఎండీ జువ్వాది రాహుల్ మాట్లాడుతూ అత్యాధునిక సౌకర్యాలతో నూతన షోరూమ్‌ను ప్రారంభించామన్నారు. వినియోగదారులకు నాణ్యమైన గృహోపకరణాలు అందించడమే తమ సంస్థ లక్ష్యం అన్నారు. ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ జయశ్రీ, గంగాధరరావు తదితరులు పాల్గొన్నారు.


షోరూమ్‌ను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే భాష్యం ప్రవీణ్

వన్యప్రాణులను కాపాడుదాం

అచ్చంపేట, న్యూస్‌టుడే: వన్యప్రాణుల సంరక్షణ అందరి బాధ్యతగా గుర్తెరగాలని అటవీ శాఖ అచ్చంపేట సెక్షన్ అధికారిణి కుసుమకుమారి తెలిపారు. గురువారం వన్యప్రాణి సంరక్షణ వారోత్సవం సందర్భంగా స్థానిక జడ్పీ ఉన్నత పాఠశాలలో జరిగిన కార్యక్రమంలో ఆమె మాట్లాడారు. ప్రకృతి సమతుల్యతకు పర్యావరణ పరిరక్షణ అవసరమన్నారు.

సీఎం సహాయనిధికి విరాళం

గురజాల గ్రామీణ, న్యూస్‌టుడే: సీఎం సహాయనిధికి ఆదిశైవ సంఘం తరపున రూ.2,11,116 అందించారు. విరాళం అందించడం అభినందనీయమని పల్నాడు డివిజన్ ఆదిశైవ అర్చక సమాఖ్య మాజీ సెక్రటరీ కూరపాటి దుర్గా నాగమల్లేశ్వరరావు పేర్కొన్నారు.

రైలు కిందపడి ఆత్మహత్య

పిడుగురాళ్ల, న్యూస్‌టుడే: తుమ్మలచెరువు రైల్వేస్టేషన్ సమీపంలో గుర్తుతెలియని వ్యక్తి రైలు కిందపడి గురువారం ఆత్మహత్య చేసుకున్నట్లు రైల్వే పోలీసులు తెలిపారు. మృతదేహం రైలు కట్టన పక్కన పడి ఉండటంతో అటువెళ్లే వ్యక్తులు రైల్వే పోలీసులకు సమాచారం అందించారు. నడికూడి పోలీసులు వచ్చి మృతదేహాన్ని గురజాల ప్రభుత్వ ఆసుపత్రి తరలించారు. మృతుడి వయసు 55 ఏళ్లపైనే ఉంటాయని రైల్వే పోలీసులు తెలిపారు.

ఆటోలు ఢీకొని నలుగురికి గాయాలు

సత్తెనపల్లి గ్రామీణ, న్యూస్‌టుడే: పాకాలపాడు సమీపంలో ఎదురెదురుగా రెండు ఆటోలు ఢీకొని నలుగురికి గాయాలైన ఘటన గురువారం జరిగింది. సత్తెనపల్లి నుంచి ప్రయాణికులతో వెళుతోన్న ఆటో, ఎదురుగా వచ్చిన మరో ఆటో రోడ్డుపై పశువులను తప్పించబోయి ఢీకొన్నాయి. రెండు ఆటోల్లోని ప్రయాణికులు షేక్ ఖాజావలి, గోవర్ధన, కుమారి, అజయ్‌కుమార్ గాయపడ్డారు.

ద్విచక్ర వాహనాలు ఢీకొని..

కాశిపాడు(పెదకూరపాడు): ఎదురెదురుగా వాహనాలు ఢీకొనడంతో కాశిపాడు గ్రామస్థుడు మేడ వెంకటేశ్వర్లు గాయపడ్డాడు. ఆయన కాశిపాడు నుంచి అమరావతికి ద్విచక్ర వాహనంపై బయలుదేరగా.. ఎదురుగా మరో ద్విచక్ర వాహనం ఢీకొంది. తీవ్రంగా గాయపడిన వెంకటేశ్వర్లును గుంటూరు ఆసుపత్రికి తరలించారు.

వర్షంతో అవస్థలు

మాచర్ల (కారంపూడి), న్యూస్‌టుడే: భారీ వర్షంతో మాచర్లలోని పలు లోతట్టు ప్రాంతాలు నీట మునిగి, ప్రజలు అవస్థలు పడ్డారు. 16వ వార్డులో మురుగు కాలువ చెత్తతో నిండటంతో వర్షపు నీరు ప్రవహించే మార్గం లేక రోడ్డెక్కాయి. అలాగే రహదారిపై చెట్టు కూలిపోవడంతో రాకపోకలకు ఇబ్బందులు పడ్డారు. మున్సిపల్ ఛైర్మన్ నరసింహారావు ఆ ప్రాంతానికి వెళ్లి రోడ్డుపై పడిన చెట్టును తొలగించేలా చర్యలు తీసుకున్నారు.


16వ వార్డులో రహదారిపై చేరిన వర్షపు నీరు